DATE: 02-04-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 05

పేజీలు - 08
వెల: రూ 5/-



ఉగాది శుభాకాంక్షలు
పాటకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
నేడు ఉగాది సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు(ఆదివారం) సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



# పరీక్షలను పండగలా చూడాలి

- అనవసర గందరగోళం తగదు
- పరీక్షలు మనమెక్కే మెట్లు మాత్రమే
- పరీక్షపై చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ
- విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ,ఏప్రిల్1:** పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమేనని.. అవే జీవితం కాదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పరీక్షలను పండగలా చూడాలని అన్నారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అనుమానాలను తొలగించడానికి 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని మోడీ నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఇది తనకు చాలా నచ్చిన కార్యక్రమమని, కానీ కరోనా వల్ల విద్యార్థులను కలవలేకపోయానన్నారు. అయితే ఇప్పుడు మళ్లీ స్టూడెంట్స్‌ను కలుసుకోవడం హ్యాపీగా ఉందన్నారు. పరీక్షలంటే విద్యార్థులకంటే వారి పేరెంట్స్‌కు ఎక్కువ టెన్షన్ ఉంటుందన్నారు. పరీక్షలను పండుగల్లా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోడీ సమాధానాలు ఇచ్చారు. పరీక్షలనేవి జీవితంలో సహజ భాగమని.. ఎదుగుదల క్రమంలో ఎక్కాల్సిన మెట్లుగా భావించాలన్నారు.

- మిగతా 2లో

## ఒప్పందం మేరకు
# ధాన్యం సేకరణ

### ముడిబియ్యం ఎంతయినా కొంటాం

- పంజాబ్ తరహాలోనే బియ్యం సేకరణ
- బాయిల్డ్ రైస్ ఇవ్వబోమని తెలంగాణ హామీ ఇచ్చింది
- ధాన్యం అంటే ముడిబియ్యమే.. వడ్లు కాదన్న పీయూష్
- రాజ్యసభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి



న్యూఢిల్లీ,ఏప్రిల్1: ధాన్యం సేకరణపై కేంద్ర విధానం స్పష్టంగా ఉందని మరోమారు కేంద్రం స్పష్టం చేసింది. ధాన్యం సేకరణ అంశంపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో ధాన్యం సేకరణపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పీయూష్ గోయల్ సమాధానం ఇచ్చారు. ధాన్యం అంటే ముడి బియ్యం అని,వడ్లుకాదని కూడా స్పష్టం చేశారు. ముడి బియ్యం ఎంతైనా కొంటామని మంత్రి అన్నారు. శుక్రవారం రాజ్యసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో బాయిల్డ్ రైస్‌పై మరోసారి తన విధానాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. బాయిల్డ్ రైస్‌ను సేకరించమని, వీటినిఅవసరమనుకున్న రాష్ట్రాలు అవే తయారు చేసుకోవాలన్నరు. కేంద్రం కేవలం ప్రజలు ఉపయోగించే బియ్యం మాత్రమే సేకరిస్తుందని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్రాల నుంచి బాయిల్డ్ రైస్ సేకరించేది లేదని రాజ్యసభలో పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు లిఖిత పూర్వకహామీలు ఇచ్చాయన్నారు. ఇందులో తెలంగాణ కూడా ఉందన్నారు. అవసరాల

- మిగతా 2లో

## నూకలు తింటాం.. మిమ్ములను గద్దెదించుతాం

- బీజేపీ అహంకారాన్ని సహించేది లేదు
- దేన్నాయినా భరిస్తాం కానీ అవమానాన్ని సహించం
- ఉద్యమంలో తెలంగాణేతరులు ఎన్నో అవమానాలు చేశారు
- ఉద్యమంతోనే వారిని అణచివేసి తెలంగాణ సాధించాం
- బియ్యం కొనమంటే కాకమ్మ కబుర్లెందుకు చెబుతారు
- పీయూష్ గోయల్ మాటలు అహంకారపూరితంగా ఉన్నాయి
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి హరీష్ రావు
- ఇక అన్ని వర్గాలకు దళితబంధు విస్తరణ
- ఇదో సామాజిక ఉద్యమంగా తీసుకున్నాం
- బడ్జెట్‌లో రూ.17800 కోట్లు కేటాయించాం
- 24గంటల కరెంట్ ఇస్తున్నది తెలంగాణలోనే
- గుజరాత్‌లోనై పవర్ హాలిడేలు నడుస్తున్నాయి
- బీజేపీ ఒక్క మంచిపని కూడా చేయడం లేదు
- దళితబంధు యూనిట్లు పంపిణీ చేసిన మంత్రి హరీష్



హైదరాబాద్,ఏప్రిల్ 1: నూకలు కూడా తింటాం.. కేంద్రంలోని బిజెపిని గద్దెదింపుతామని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

- మిగతా 5లో

## ప్రజాస్వామ్య విధానం కంటే
# ఎవరూ ఎక్కువ కాదు

- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంలోనే మన స్వేచ్ఛ
- ప్రజాస్వామ్యంపై ఆధిపత్యం చలాయించ రాదు
- పోలీసు విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిది
- పోలీసులు నిస్పక్షపాతంగా పనిచేయాలి
- సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్1:** అందరి విషయంలో చట్టం సమానంగా అమలు చేయడం పోలీసుల విధి అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. బాధితులకు న్యాయం అందించడంలో చట్టం అమలు అంతర్భాగమన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంలో పోలీసు విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదని సీజేఐ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ పాల్గొన్నారు.

- మిగతా 2లో

## కమర్షియల్ సిలిండర్‌పై పడ్డ చమురు కంపెనీలు

- కమర్షియల్ సిలిండర్ ధర భారీగా పెంపు
- ఒకేసారి రూ.273.5 పెంచిన సంస్థలు



న్యూఢిల్లీ,ఏప్రిల్1: చమురు ధరల మోత ఇప్పట్లో ఆగేలా లేదు. నిన్నటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన దేశీయ చమురు కంపెనీలు.. ఇప్పుడు వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌పై భారీగా వడ్డించాయి. ఒకేసారి రూ.273.5 పెంచాయి. దీంతో హైదరాబాద్ కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2460కి చేరింది. ఇక దేశరాజధాని న్యూఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.250 పెరిగింది. దీంతో రూ.2253కు చేరింది. అయితే ప్రస్తుతానికి

- మిగతా 2లో

## రాజ్‌భవన్- ప్రగతిభవన్ మధ్య
# మరింత గ్యాప్?



## ఉగాది వేడుకలకు హాజరు కానీ సీఎం, మంత్రులు!

హైదరాబాద్,ఏప్రిల్ 1: దేశంలో గవర్నర్ లు, ముఖ్యమంత్రు ల మధ్య వివాదాలు కొత్త కాదు.గతంలోనూ ఉన్నాయి. ప్రస్తుతమూ కొనసాగుతున్నాయి. ఇటీవలే ఆ జాబితాలో తెలంగాణ కూడా చేరింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ , సీఎం కే. చంద్రశేఖర్ రావు ల మధ్య ఇటీవలి కాలంలో విభేదాలు ఏర్పడ్డాయి. కొత్త సంవత్సరం శుభకృత్‌తో అయినా, ఇద్దరి మధ్య మళ్లీ స్నేహం చిగురిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూశారు. స్నేహం మాట అటుంచితే, అసలు మంత్రులు గానీ, టీఆర్ఎస్ నేతలు కనీసం రాజ్‌భవన్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. గత రిపబ్లిక్‌డే నాడు అవి మరింత బహిరంగం అయ్యాయి. తాజాగా కొత్త సంవత్సరం వేడుకలతో ప్రగతిభవన్,

- మిగతా 2లో

## 2నుంచి ప్రారంభం కానున్న రంజాన్

### ఉద్యోగులకు నమాజు వెసలుబాటు



హైదరాబాద్,ఏప్రిల్1: పవిత్ర రంజాన్ మాసం ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గంట ముందే ఇంటికి వెళ్లేలా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 3 నుంచి మే 2వ తేదీ వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే తమ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నెలవంక దర్శనం మరుసటి రోజు నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇస్లాంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. దివ్య గ్రంథమైన పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే

- మిగతా 2లో


## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో బండి భేటీ

### కరీంనగర్‌కు సైనిక స్కూలుపై కృతజ్ఞతలు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 1: కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మరిన్ని సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్

- మిగతా 2లో

## ప్రజానాడి




# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

## నిప్పుల కుంపటిగా మారడంలో బెంబేలు

## మరో రెండుమూడు రోజులు ఇదే పరిస్థితి



**హైదరాబాద్,ఏప్రిల్1:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొరసాగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో జనం బెంబేలెత్తుతున్నారు.ఉదయం 12 గంటలు దాటితే ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. మరో మూడు రోజులు రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు అంటున్నారు. రాగల మూడు రోజులు సాదారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించారు. శుక్ర, శనివారాల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ, రాయలసీమ మీదుగా ఒడిషా నుంచి తమిళనాడు వరకు ఏర్పడిన ఉపరితలద్రోణి సముద్రం మట్టం నుంచి .9 కి.మీ. ఎత్తులో కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రజలంతా

- మిగతా 5లో

## ఈ ఉగాది, తెలంగాణ యువతకు
# ఉద్యోగ నామ సంవత్సరం

### ఉగాది పండుగ వేళ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక సందేశం



హైదరాబాద్ ఏప్రిల్ 01(ప్రజా మంటలు) : తెలంగాణ బిడ్డలందరికీ ఉగాది పండగ శుభాకాంక్షలు. శుభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో శుభాలను తీసుకురావాలని, మనందరం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఉగాది పర్వదినాన "శతాయు వజ్రదేహాయ సర్వ సంపత్ కారాయచ.. సర్వా (రిష్ట వినాశాయ.. నింబకం దళ భక్షణమ్? అంటూ పచ్చడి తాగుతాం. ఉగాది పచ్చడిలో ఉండే

- మిగతా 5లో

# పరీక్షలను పండగలా చూడాలి

**మొదటిపేజీ తరువాయి..**

అనవసరంగా భయాందోళనకు గురికావొద్దని సలహా ఇచ్చారు. ఢిల్లీలోని తాలక్‌టోరా స్టేడియంలో నిర్వహించిన ఐదో విడత పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. కరోనా కారణంగా సుదీర్ఘకాలం తర్వాత నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ-2022 కార్యక్రమంలో సమయాన్ని చదువుకోసం కేటాయిస్తున్నామా, సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నామా అని ఆత్మపరిశీలన చేసుకోవాలని మోదీ సూచించారు. విద్య జ్ఞానాన్ని పొందే సూత్రంపై ఆధారపడి ఉంటుందని, జాతీయ విద్యా విధానం ముసాయిదాను సిద్ధం చేసేందుకు చాలా మంది అందులో పాలుపంచుకున్నారని తెలిపారు. సుమారు 6-7 ఏళ్ల పాటు



విద్యార్థులను కలుసుకోవటం తనకు ఎంతో ప్రత్యేకమన్నారు. పరీక్షలను ఒక పండగలా జరుపుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన కళాకండాల ప్రదర్శనను తిలకించారు.

సమయాభావం వల్ల విద్యార్థుల ప్రశ్నలన్నింటికి ఈ వేదికపై సమాధానం ఇవ్వలేం. వీడియో, ఆడియో, సందేశాలు, టెక్ట్స్ రూపంలో నమో యాప్ ద్వారా అందిస్తాను. ఇక్కడ కూర్చున్న వారిలో తొలిసారి పరీక్షలకు హాజరవుతున్నవారెవరూ లేరు. పలుమార్లు పరీక్షలకు హాజరైనందున వాటి గురించి పూర్తి అవగాహన ఉంటుంది. మన జీవితంలో పరీక్షలు ఒక మెట్టు. పరీక్షల సమయంలో ఆందోళనకు గురికాకుండా ఉండాలి. స్నేహితులను అనుకరించకూడదు. నీకు వచ్చింది ఆత్మవిశ్వాసంతో పూర్తి చేయాలి. మీరంతా పరీక్షలను ఒక పండగలా జరుపుకోవాలి. ఆఫ్‌లైన్‌లో ఎలా జరిగిందో.. ఆన్లైన్‌లోనూ అదే జరుగుతుందన్నారు. ఇక్కడ మీడియం ముఖ్యం కాదు. మాధ్యమంతో సంబంధం లేకుండా, విషయాన్ని లోతుగా పరిశోధిస్తే, అర్థం చేసుకోవటంలో తేడా ఉండదని నరేంద్ర మోదీ అన్నారు.

విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నప్పుడు తాము శోధించి రూపొందించామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు నిపుణుల సూచనలు తీసుకున్నామని చెప్పారు. ఆన్ లైన్ క్లాసుల గురించి కూడా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆన్ లైన్ రీడింగ్ చేసేటప్పుడు చదువుతున్నారా లేదా రీల్స్ చూస్తున్నారనేది తమను తాము ప్రశ్నించుకోవాలని చమత్కరించారు. 'ఆన్ లైన్, ఆఫ్ లైన్ అనేది సమస్య కాదు. మాధ్యమం సమస్యే కాదు.. అసలు సమస్య మనసుతోనే. తరాన్ని బట్టి సాంకేతికంగా మార్పులు వస్తూ ఉంటాయి. ఇప్పుడీ డిజిటల్ యుగంలో నేర్చుకోవడం చాలా సులువుగా మారింది. ఆన్ లైన్ ఎంతో అవసరం. దీని నుంచి ఎంతో జ్ఞానాన్ని సముపార్జించొచ్చు. ఇలా నేర్చుకున్న జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించాలి' అని మోడీ పేర్కొన్నారు. ఇక ఉప్పల్ లోని కేంద్రీయ విద్యాలయం1లో ' పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని వర్చువల్ గా నిర్వహించారు. ఇందులో సుమారు 3 వేల మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. పరీక్షలంటే విద్యార్థుల కంటే వారి పేరెంట్స్ కు ఎక్కువ టెన్షన్ ఉంటుందన్నారు. పరీక్షలను పండుగల్లా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోడీ సమాధానాలు ఇచ్చారు.

## కమర్షియల్ సిలిండర్‌పై పడ్డ చమురు కంపెనీలు

**మొదటిపేజీ తరువాయి..**

గృహ అవసరాలకోసం వినియోగించే 14 కిలోల సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకపోవడం కొంతలో కొంత ఊరటనిస్తున్నది. కాగా, గతనెల 1న 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను రూ.105 మేర పెంచిన విషయం తెలిసిందే. దీంతో హోటళ్లలో మరోమారు తినుబండారాల ధరలు భారీగాపెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యుడి జీవనం తలకిందులైతోంది. ఆయిల్ కంపెనీల నిర్ణయంతో నిత్యావసరాల ధరలు కూడా మిన్నంటుతున్నాయి. పాల ప్యాకెట్లు, కూరగాయలు, వంట నూనెలు.. ఇలా ఏది చూసినా పెరిగిన ధరలే కనిపిస్తున్నాయి. ధరల పెరుగుదలతో మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకులతో సతమతమవుతున్న ప్రజలకు ఇదికూడా భారంగా మారనుంది. చమురు మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కంపెనీలు ప్రతి నెల 1వ తేదీన గ్యాస్ కంపెనీలు సిలిండర్ ధరలను సవరిస్తూ ఉంటాయి. అలాగే ఏప్రిల్ 1న 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.250 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. అయితే 14 కిలోల గృహ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం 14 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1002వద్ద నిలకడగా ఉంది. ఈ సిలిండర్ ధర మార్చి 22న రూ.50 పెంచాయి. ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,253 ఉండగా, కోల్‌కతాలో రూ.2,351 ఉంది. ఇక ముంబైలో రూ.2,205 ఉండగా, చెన్నైలో రూ.2,406వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్‌లో రూ.2,400పైగా ఉంది. అయితే గత రెండు నెలల్లో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.346 వరకు ఎగబాకింది. అంతకు ముందు మార్చి 1న ఈ సిలిండర్‌పై రూ.105 వరకు పెరిగింది.

# రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో బండి భేటీ

**మొదటిపేజీ తరువాయి..**

నియోజకవర్గ పరిధిలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ఆమోదం తెలపడంపట్ల మంత్రికి బండి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో రాజకీయ పరిస్థితిపై రాజ్‌నాథ్ చర్చించారు. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేస్తున్న



కార్యక్రమాలను, ప్రజా సంగ్రామ యాత్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 'టీఆర్ఎస్ అవినీతి-కుటుంబ-నియంత పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన తొలిదశ 'ప్రజా సంగ్రామ యాత్ర' విజయవంతమైందని, అందులో భాగంగా ఈనెల 14 నుండి రెండో విడత ' ప్రజా సంగ్రామ యాత్ర'ను చేపడుతున్నట్లు' రాజ్‌నాథ్‌సింగ్‌కు సంజయ్ వివరించారు. ఆయన వెంట కేంద్ర జల వనరుల విభాగం సలహాదారుడు వెదిరె శ్రీరాం ఉన్నారు.

## 2నుంచి ప్రారంభం కానున్న రంజాన్

**మొదటిపేజీ తరువాయి..**



దివి నుంచి భువిపైకి అవతరించింది. దీనికి ప్రతీకగా ఈ మాసంలో ఉపవాసాలను ఆచరిస్తారు. రంజాన్ మాసంలో సూర్యోదయానికి ముందు ముస్లింలు ఉపవాస దీక్షను ప్రారంభించి ప్రార్థనల్లో పాల్గొంటారు. సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం ఉపవాస దీక్షను విరమిస్తారు.

## ప్రజాస్వామ్య విధానం కంటే ఎవరూ ఎక్కువ కాదు

**మొదటిపేజీ తరువాయి..**

కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) వ్యవస్థాపక డైరెక్టర్ డీపీ కోహ్లీ 19వ స్మారకోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యంలో దర్యాప్తు సంస్థల పాత్ర, బాధ్యతలపై సీజేఐ ఎన్వీ రమణ ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంలోనే మన స్వేచ్ఛ ఉంటుందని జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. రాజ్యాంగం చెప్పిన ప్రజాస్వామ్య విధానం కంటే ఎవరూ ఎక్కువ కాదన్నారు. ప్రజాస్వామ్యంపై ఆధిపత్యం చలాయించాలని ఎవరూ చూడకూడదన్న ఆయన.. నేరాల నిరోధానికి పోలీసులు నిస్పక్షపాతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రారంభ దశలో సీబీఐపై ప్రజల్లో ఎంతో నమ్మకం ఉండేదన్న సీజేఐ.. నిష్పాక్షికత, స్వతంత్రత విషయంలో సీబీఐ ప్రతీకగా నిలిచేదన్నారు. పోలీసు వ్యవస్థను ప్రస్తావిస్తూ, అందులో కొన్ని సంస్కరణల గురించి మాట్లాడారు. సీజేఐ రమణ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. అంతే కాదు పోలీసులు, రాజకీయాల అనుబంధాన్ని కూడా సీజేఐ ప్రస్తావించారు. ' పోలీసులు, దర్యాప్తు సంస్థలు సహా అన్ని వ్యవస్థలు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండడం సహా వాటిని బలోపేతం చేయడం అవసరం. ఎలాంటి అధికారిక వ్యవస్థల జోక్యానికి అవి అవకాశం ఇవ్వరాదు. పోలీసులు నిస్పక్షపాతంగా పని చేసి, నేర నిర్మూలనపై దృష్టి సారించాలి. సమాజంలో శాంతి భద్రతలు వెల్లివిరిసేలా పోలీసులు.. ప్రజలను సమన్వయం చేసుకుంటూ పని చేయాలి. కాలానుగుణంగా రాజకీయ, కార్యనిర్వహక వ్యవస్థలు మారుతూ ఉంటాయి. కాని ఓ వ్యవస్థగా మీరు శాశ్వతంగా ఉంటారు. పోలీసులు ధృడంగా, స్వతంత్రంగా ఉండాలి. మీ సేవలకు మద్దతు తెలపండి.' అంటూ పిలుపునిచ్చారు. పోలీసు వ్యవస్థకు సంబంధించి, సీజేఐ మాట్లాడుతూ, ఇన్‌ఫ్రా,మ్యాన్ పవర్ లేకపోవడం, తక్కువ స్థాయి అమానవీయ పరిస్థితులు, ఆధునిక పరికరాల కొరత, సాక్ష్యాలను పొందే సందేహాస్పద పద్ధతులు, రూల్ బుక్ ప్రకారం పనిచేయడంలో విఫలమైన అధికారులు శిక్షార్హులన్నారు. పోలీసుల్లో జవాబుదారీతనం లేకపోవడం వంటి అంశాలు పోలీసు వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ఒప్పందం మేరకు ధాన్యం సేకరణ

**మొదటిపేజీ తరువాయి..**

తగదన్నారు. తెలంగాణ ప్రభుత్వం పారా బాయిల్డ్ ఇవ్వమని రాతపూర్వకంగా ఇచ్చిందని, ఎంవోయూ ప్రకారమే ముడి బియ్యం ఇస్తామని రాసిచ్చారని పీయూష్ గోయల్ తెలిపారు. ఈ మేరకు పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇప్పుడు కొత్తగా వడ్ల సేకరణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని, ధాన్యం సేకరణ అంశానికి సంబంధించి సీఎం ద్వారా దమ్కీలు ఇస్తున్నారని తెలంగాణ ప్రభుత్వంపై పరోక్షంగా ఆరోపణలు చేశారు. పంజాబ్ తరహాలో కొనాలని తెలంగాణ సీఎం కేసీఆర్ లేఖ రాశారని,పంజాబ్‌లో పండే బియ్యాన్ని దేశమంతటా తింటారని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.. మరి అటువంటి బియ్యాన్ని ఇవ్వాలని కోరామని పీయూష్ గోయల్ అన్నారు. రైతులను తప్పుదోవ పట్టించేలా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తెలంగాణలో పండే రా రైస్ మొత్తం తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ ఎంపి కేశవరావు మాట్లాడుతూ తెలంగాణ నుంచి కేంద్రం ఎంత బియ్యాన్ని కొంటుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణ గురించి ఎన్నో సార్లు చర్చించామని మంత్రి అంటున్నారని, కానీ ఆయన ప్రతిసారి కన్‌ఫ్యూజ్ చేస్తున్నారని అన్నారు. డీసెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్ (డీసీపీ) విధానంలో ధాన్యం సేకరిస్తున్న రాష్ట్రాల నుంచి కేంద్రం ధాన్యం కొంటుందా లేదా అని ఆయన ప్రశ్నించారు. డీసెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్‌లో భాగంగా రాష్ట్రమే నేరుగా ధాన్యం కొని మిల్లింగ్ తర్వాత ఎఫ్‌సీఐకి ఇస్తుందన్నారు. కానీ ధాన్యం కొనుగోలు సమయంలో జూన్ నెలలోనే మేం డబ్బులు చెల్లిస్తామని, కేంద్రం మాత్రం ఆగస్టులో ఆ అమౌంట్ ఇస్తుందని కేశవరావు అన్నారు. తమ వద్ద నుంచి ఎంత మొత్తంలో బియాన్ని కొనుగోలు చేస్తారో కేంద్రం స్పష్టంగా చెప్పాలని ఆయన అడిగారు. కేంద్ర ఆహార శాఖ తన లేఖల్లో కానీ ఒప్పందాల్లో కానీ వరి గురించి చెప్పిందని, కానీ ఎక్కడా బియ్యం అన్న పదాన్ని వాడలేదన్నారు. తెలంగాణలో భిన్న వెరైటీ ధాన్యం ఉంటుందని, ఒడిశా లో మరో రకంగా ఉంటుందని ఆయన అన్నారు. ఆ వెరైటీలతోనే బాయిల్డ్ రైస్ తయారు అవుతుందని ఎంపీ కేశవరావు అన్నారు.

# ధాన్యం కొనలేకపోతే తప్పుకో

## అలాంటప్పుడు అధికారమెందుకు

## బీజేపీపై అక్కసుతో రైతుల ఉసురు తీయొద్దు

## కేసీఆర్ తీరుతో అన్ని రంగాలు కుదేలు

## మండిపడ్డ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్




హైదరాబాద్,ఏప్రిల్1: ధాన్యం కొనకుంటే అధికారం నుంచి సిఎం కేసీఆర్ తప్పుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... నీచ, నికృష్టమైన.. కేసీఆర్ మతి తప్పిన ఆలోచనలతో రైతులు మునిగిపోయారని విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి తప్పులు చేస్తే.. శిక్ష ఎంజీఎం సూపరింటెండెంట్ అనుభవించాలా? అని ప్రశ్నించారు. చేతకాక, చేవలేక ముఖ్యమంత్రి చిల్లర పనులు చేస్తున్నారన్నారు. పెంచిన విద్యుత్, బస్ చార్జీలు నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం సీఎం చేస్తున్నారని మండిపడ్డారు. లక్షలాది రైతులు, పౌల్ట్రీ రంగం ఉసురు కేసీఆర్ పోసుకుంటున్నారని అన్నారు. తమపై కోపాన్ని.. సీఎం కేసీఆర్ అధికారం ఇచ్చిన రైతులపై చూపుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. కాళ్ళ కింద భూమి కదిలిపోతున్నందునే కేసీఆర్ నెపాన్ని కేంద్రంపై వేస్తున్నారని అన్నారు. రైతులు పంటలు వేయకుండా కంట్లో మట్టికొట్టి కేసీఆర్ కనీళ్ళు చూస్తున్నారని ధ్వజమెత్తారు. తన కాళ్ళ కింద భూమి కదిలిపోతుందని సీఎం కేసీఆర్ భయపడుతున్నారని రాజేందర్ మండిపడ్డారు. ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ రాజకీయం చేస్తోందన్నారు. కోపం వుంటే బీజేపీపై తీర్చుకోవాలని, రైతులపై కక్ష సాధింపు వద్దన్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే కొనకుండా రైతుల్ని వేధించడం సరైంది కాదన్నారు. కరువు వస్తే పంటలు పండకపోతే ఒకే? కానీ అన్నీ వుండి కూడా పంటలు పండించవద్దనడం మూర్ఖత్వమే అన్నారు. 10వేల కోట్లు పెట్టి పంట కొనుగోలు చేయాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనాలన్నారు. కేంద్రం చెబితే అన్నీ చేస్తున్నారా అని ప్రశ్నించారు. రైతుల కళ్ళల్లో మట్టికొట్టావు. వారికి అన్యాయం చేయవద్దన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్ళు చేయాలి. లేదంటే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

## రాజ్‌భవన్- ప్రగతిభవన్ మధ్య

# మరింత గ్యాప్?

**మొదటిపేజీ తరువాయి..**

రాజ్‌భవన్‌కు మరింత గ్యాప్ పెరిగిందని స్పష్టమైంది. ఉగాది ఉత్సవాలకు రావాలంటూ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించారు గవర్నర్ తమిళిసై. రాజ్‌భవన్‌లో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనాలంటూ ప్రగతి భవన్‌కు ఆహ్వానం పంపారు. కానీ, కేసీఆర్‌తో పాటు మంత్రులు ఎవరూ కూడా రాజ్‌భవన్‌వైపు కన్నెత్తి చూడలేదు. సీఎం, మంత్రులకు ఆహ్వానం పంపినా గైర్హాజరయ్యారు. పోలీస్, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పెద్దగా హాజరుకాలేదు. అటు ఈ వేడుకల్లో ఓ ఫ్లెక్సీ ఇంట్రెస్టింగ్‌గా కనిపించింది. రాజ్‌భవన్‌లో ఉగాది ఫ్లెక్సీలపై కేసీఆర్ ఫోటో ఎక్కడా కనిపించలేదు. ఈ ఉగాది వేడుకలతోనైనా కేసీఆర్ రాజ్‌భవన్‌లో అడుగుపెడతారని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు కూడా కేసీఆర్ హాజరుకాలేదు. గతంలో గవర్నర్‌గా ఉన్న ఈఎస్ఎల్ నర్సింహన్ స్థానంలో 2019 సెప్టెంబర్‌లో తమిళిసైని రాష్ట్ర గవర్నర్‌గా నియమించారు రాష్ట్రపతి. అప్పుడు కేసీఆర్‌కు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య ఎలాంటి విభేదాలు లేవు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు సీఎం హాజరయ్యేవారు. కానీ, కాంగ్రెస్ నుంచి వచ్చి టీఆర్ఎస్‌లో చేరిన పాడి కౌశిక్‌రెడ్డిని గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా ప్రతిపాదిస్తూ, సీఎం కార్యాలయం పంపిన ఫైలును గవర్నర్ పక్కన పెట్టడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయని ప్రచారం జరిగింది. అప్పటి నుంచి గవర్నర్, సీఎం దూరం దూరంగానే ఉంటున్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం వద్దన్నా, నిమ్స్‌కు వెళ్లడం, కొన్ని విషయాలపై ప్రభుత్వ అధికారుల వివరణ కోరడం, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఒక బాక్స్‌ను ఏర్పాటు చేయడం, వంటివి గ్యాప్ పెరగడానికి కారణమనే ప్రచారం జరిగింది. కాగా, ఇద్దరి మధ్య విభేదాలు ఏ స్థాయికి వెళ్తాయో వేచి చూడాలి మరీ. మరోవైపు నగరంలోని ఇందిరా పార్క్ వద్ద ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ సంస్కృతి మహోత్సవవానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలసి గవర్నర్ తమిళి సై హాజరయ్యారు. తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని గవర్నర్ సందర్శించారు. అలాగే ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్ స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళి సై మాట్లాడుతూ సంస్కృతి మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందుకు సంతోషిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రజలు మద్దతు ఇవ్వాలని, విజయవంతం చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాలకు చెందిన స్టాల్స్ చాలా బాగున్నాయన్నారు. దేశ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర ఘటనచోటు చేసుకుంది. అక్కడ ఓ స్టాల్‌లో టోపీని తీసుకున్న గవర్నర్ దానిని కేంద్రమంత్రి తలపై పెట్టారు. తరవాత తానూ ఓ టోపి పెట్టుకున్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధులు ముఖ్యంగా, ప్రత్యేకించి అంతగా ప్రచారం పొందని వీరులు చేసిన త్యాగాలను స్మరించుకొని యువతరానికి స్ఫూర్తిని అందించడం కోసం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమర యోధులపై ప్రత్యేక ఫోటో ప్రదర్శన నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ , కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఎన్టీఆర్ స్టేడియంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. శుక్రవారం నుంచి మూడవ తేదీ వరకు ఈ ప్రదర్శన వుంటుందని నిర్వాహకులు తెలిపారు. సంస్కృతీ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార ,ప్రసార మంత్రిత్వ శాఖ రీజనల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్ వో బి) తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల పై ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. బ్రిటీష్ పాలనకు, అప్పటి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల పాత్రను ఈ ఎగ్జిబిషన్ ప్రదానంగా వివరిస్తుంది. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడటం లో కుమురం భీం వంటి అంతగా వెలుగు లోకి రాని అసామాన్య వీరుల పాత్రను కేంద్ర మంత్రి గవర్నర్ కు వివరించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ వంటి ఇతివృత్తాలతో సహా సుమారు 50 ప్యానెల్స్ ను ఎగ్జిబిషన్ లో ఉంచారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, మన స్వాతంత్ర్య సమర యోధులు, ప్రత్యేకించి అంతగా ప్రచారం పొందని వీరులు చేసిన త్యాగాలను స్మరించుకొని యువతరానికి స్ఫూర్తిని అందించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగ పడుతుందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమర యోధులపై ప్రదర్శనలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న మూడు రోజుల సాంస్కృతిక ఉత్సవంలో దేశంలోని అన్ని ప్రాంతాల నుండి సుమారు 1000 మంది కళాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.



# వసంతం వెల్లివిరిసే శుభకృత్ !

ఉగాది అంటే యుగారంభమని నమ్మిక..పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించా డని పురాణోక్తి. ఈ యేడు శుభకృత్ నామ సవంత్సరం కావడంతో మనకంతా మంచే జరుగుతుందని పండితులు ఆకాంక్షిస్తున్నారు. చైత్ర శుక్ల పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు తన సృష్టి ముగించాడనీ, అదే యుగారంభమనీ చెబుతారు. అయితే, ఆ రోజునే సృష్టి ప్రారంభమయిందనీ అందుకే ఆ రోజు యుగాదిగా పరిగణన పొందిందనీ అంటారు. ఉగస్య ఆది అనేదే ఉగాది. ఉగ అనగా నక్షత్ర గమనం.జన్మ ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు ఉగాది. అనగా ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయింది. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్ధం. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం యుగం సంవత్సరం కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది వసంతాలకు గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృస్వరూపం. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణైతికంగా చెప్పబడింది. వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యవతారిదారియైన విష్ణువు వేదాలను బ్రహ్మ కప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చెనని పురాణ ప్రతీతి. చైత్రశుక్లపాడ్యమినాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపబడుతుందని కూడా చెప్పబడుతుంది. శాలివాహన చక్రవర్తి చైత్రశుక్లపాడ్యమి నాడే పట్టాభి షిక్తుడై తన శౌర్యపరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం. మొత్తంగా 60 వసంతాలు ఉంటాయి. ప్రభవతో మొదలై 60 ఏళ్ల తరవాత మళ్లీ ప్రభవ వస్తుంది. ప్రస్తుతం మనం శుభకృత్‌లోకి ప్రవేశిస్తున్నాం. ఇది శుభాన్ని సమకూర్చే సంవత్సరమని ప్రతీతి.ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిలించి మానవాళిలో నూతనాశయాలను అంకురింప చేసే శుభదినం ఉగాది. శిశిర ఋతువు ఆకురాలు కాలం. శిశిరం తరువాత వసంతం వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. కోయిలలు కుహూకుహూ అని పాడుతాయి.ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్రపరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంక రిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం.తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.. ఉగాది వస్తోందంటే చాలు వేప పచ్చడీ, పంచాంగ శ్రవణమే గుర్తుకుస్తాయి. మరి ఉగాది అంటే ఇంతేనా! ఆ రోజు పూజించేందుకు ప్రత్యేకమైన దైవం కానీ, ఆచరించాల్సిన విధులు కానీ లేవా అంటే లేకేం... చైత్రశుద్ధ పాడ్యమి రోజునే సృష్టి మొదలైందని పెద్దలు చెబుతారు. అందుకనే ఆ రోజుని యుగాది లేక ఉగాదిగా గుర్తిస్తారు. ప్రతి పండుగలానే ఇవాళ కూడా సూర్యోదయానికి ముందరే నిద్రలేచి తైలాభ్యంగన స్నానం చేయమని చెబుతారు. నువ్వులనూనెని ఒంటికి పట్టించి చేసే స్నానమే ఈ తైలాభ్యంగనం. ఏ రోజు కుదిరినా కుదరకపోయినా సంవత్సరానికి తొలిరోజైన ఉగాదినాడు తైలాభ్యంగనం చేసి తీరాలన్నది పెద్దల శాసనం. సంవత్సరపు ఆరంభాన్ని ఇలా శుచిగా, ఆరోగ్యంగా ప్రారంభించాలన్నది వారి అభిమతం. అభ్యంగన స్నానం ముగిసిన తరువాత గడపకు పసుపు, కుంకుమలను అద్ది గుమ్మానికి మామిడి తోరణాలు కట్టాలి. ఇక ఉగాదిరోజున ఏ దైవాన్ని పూజించాలి అన్నది కూడా ఓ సందేహమే! ఉగాది రోజున కాలమే దైవం. కాబట్టి మనకు ఇష్టదైవాన్ని ఆ కాలపురుషునిగా తల్చుకుని పూజించుకోవాలి. స్థితికారుడైన విష్ణుమూర్తిని స్మరించినా, లయకారుడైన శివుని కొలిచినా, ప్రకృతికి చలనాన్ని అందించే అమ్మవారిని ధ్యానించినా సమ్మతమే! ఇష్టదేవతల స్తోత్రాలని పఠించి పూజించిన తరువాత వారికి ఉగాది పచ్చడిని నివేదించాలి. పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరురుచుల కలయికగా ఉగాది పచ్చడిని రూపొందిస్తాము. వైద్యపరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది. ఆధ్మాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఖాల మిశ్రమం అని చెప్పడమే ఉద్దేశంగా కనిపిస్తుంది. ఒక పక్క జీవితం శుభాశుభాల మిశ్రమం అని గ్రహిస్తూనే రాబోయే రోజులకి సిద్ధపడాలనే సూచనని అందించేదే పంచాంగం. అందుకనే సంవత్సరపు మొదటిరోజైన ఉగాది నాడు పంచాంగం విని తీరాలంటారు పెద్దలు.



ఇక ఉగాది రోజున 'ప్రపాదానం' అంటే చలివేంద్రాన్ని పెట్టమన్నారు పెద్దలు. ఎండలు మొదలయ్యే ఈ సమయంలో చలివేంద్రంతో బాటసారుల దాహార్తిని నింపడమే వారి ఉద్దేశం. చలివేంద్రం స్థాపించే స్తోమత అందరికీ ఉండదు కాబట్టి ఒక నీటి కుండనైనా దానం చేయమని సూచిస్తున్నారు. ఎండలని తట్టుకుంటే నీరు ఇస్తే సరిపోదు కదా! అందుకని సూర్యుని తాపాన్ని ఎదుర్కొనేందుకు ఉగాదినాడు చెప్పులూ, గొడుగులు కూడా దానం చేయాలన్నది పెద్దల మాట. ఉగాది రోజున కొందరు ధర్మకుంభదానం పేరుతో నీరు నింపిన కలశాన్ని పెద్దలకు అందించాలని చెబుతారు. ఉగాది ప్రత్యేకించి ఏ దైవానిదీ కాదు కాబట్టి, ఇంతకు ముందు ఎన్నడూ దర్శించని పుణ్యక్షేత్రానికి వెళ్లమని చెబుతారు. ఉగాది నూతన సంవత్సరానికి సూచన కాబట్టి కొత్త పనులను చేపట్టమని ప్రోత్సహిస్తారు. ఉగాది రోజున చేయవలసిన పనులు ఇన్ని ఉన్నాయన్నమాట.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

## రైతుబిడ్డ కన్నీటిగాథ

ఒక అందమైన పల్లెటూరు. ఆ ఊరిలో ఒక చిన్న కుటుంబం. అమ్మ నాన్న ( సరోజనబిచంద్రయ్య) ఇద్దరు పిల్లలు అబ్బాయి పేరు రోహాన్ , అమ్మాయి శ్రినిత. ఆ ఊరిలో ఎవరికి కష్టం వచ్చిన నేనున్నాను అంటూ ముందుకు వెళ్ళేవాడు చంద్రయ్య. కూతురు 5 వ తరగతి చదువుతోంది. కొడుకు ఇంటర్ చదువుతున్నాడు వీరికి ఏకరం భూమి మాత్రమే ఉంది . వ్యవసాయం చేస్తూ పిల్లలని పోషిస్తున్నాడు.

చంద్రయ్య వాళ్ళ ఇంటి పక్కన ఇంట్లో రామయ్య అనే రైతు ఉండేవాడు. ఒకరోజు అతను ఇంటి ముందు బాధ పడుతూ కూర్చోవటం చూసి దగ్గరకు వెళ్లి ఎం అయింది అని అడుగుతాడు. రామయ్య కన్నీళ్ళతో, ఈ సారి వానలు లేవు నికు తెలిసిందే కదా! వానలు లేవు అని ఉన్న డబ్బులతో బావిని త్రవ్వించాను. అందులో చుక్క నీరు పడలేదు. ఇప్పుడు చేతిలో పైసా లేదు, తినటానికి బుక్కెడు బువ్వ లేదు. అందరికీ అన్నం పెట్టే రైతన్నలకి ఇంత దిన పరిస్థితి
నేలమ్మా గొంతు తడపని వాన, తులసి నీళ్ళు అయ్యి నా గొంతు ఐన తడుపుతుందేమో , వాన లేక ఎండిన పొలం, నా షేవానికి పూల పాన్పు అవుతుందేమో అని కన్నీరు కారుస్తాడు.



చంద్రయ్య ఈ సారి పండక పోతే ఎన్టీ రామయ్య వచ్చే పంట తప్పకుండా పండుతుంది. నేను మా పిల్లల చదువుకి 5000 దాచాను తెచ్చి ఇస్తాను అంటూ వెళ్లి తెచ్చి ఇచ్చి రామయ్య కన్నీళ్లను తుడుస్తాడు.

రోజులు గడుస్తున్నాయి ఇంకా ఇంకా కరువు కాలం వచ్చేసింది. చంద్రయ్య పొలం కూడా ఎండి పోవటానికి వొస్తుంది. పంటను పురుగు తినేస్తుంది .పిల్లల చదువులకి డబ్బులు సరిపోకా చదువులు అపేస్తాడు. పంటకు ఎరువులు చల్లుదాం అని షావుకారి దగ్గరకు వెళ్ళి ఉద్దరేకు మందులు తెస్తాడు. ఎరువులు చల్లిన ప్రయోజనం లేకుండా పోయింది పంట మొత్తం ఎండి పోయింది. ఎండిన పంటను చూసి తట్టుకోలేక కన్నీటి తో ఇంటికి వెళతాడు. ఇంట్లో తిందాం అంటే సరిపడా సరుకులు లేవు. పిల్లలు ఆకలి ఆకలి అని అలమటిస్తున్నారు.
చూడలేక మళ్ళీ పొలానికి వచ్చేస్తాడు. చెట్టు కింద కూర్చుని ఆలోచిస్తాడు. చేసిన అప్పుని తీర్చలేను. పిల్లలకి కడుపు నిండా తిండి పెట్టలేను. దేవుడు ఉన్నాడో లేడో తెలియదు, కనిపించని దేవునికి విరాళాలు , పరమాన్నాలు సమర్పిస్తారు. అందరికీ అన్నం పెట్టే రైతుకి పురుగుల మందే పరమాన్నం అవుతుంది.

నాకు ఈ జీవితం వొద్దు అంటూ చెట్టుకి ఉరేసుకొని చనిపోవాలని సిద్ధం అవుతున్నాడు. ఇంతలో కొడుకు రోహన్ వస్తాడు. నాన్న ఎం చేస్తున్నావ్ అసలు అర్ధం అవుతుందా ? మీరు చనిపోతే మా పరిస్థితి ఎన్టీ మేము ఎం కావాలి? మీతో పాటు మమల్ని చంపండి. అందరం కలిసి హాయిగా చనిపోధాం అంటాడు.
ఎం చేయాలి బిడ్డ , నెలకందని వాన , చేతికందని పంట ,కడుపుకందని కూడు, ఊహకందని బాధ, అప్పులే అస్తుల్లయే, ఇంతకన్నా ఎం చేద్దాం అంటాడు.
ఎందుకు చనిపోవాలి నాన్న ఇంత కన్న మార్గమే లేదా! ఉంది. ప్రభుత్వాలు ఉన్నాయి . మనల్ని ఆదుకుంటాయి అంటూ పంటను మరియు తన పరిస్థితి వివరిస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాడు. వీడియో చూసిన ప్రతి ఒక్కరూ తోచినంత సాయం చేస్తారు. వీడియో ప్రభుత్వానికి చేరుతుంది. వారికి కావలసిన సాయం అందిస్తుంది.

ప్రభుత్వం అంటే దోచుకుని తినే వారు కాదు. కష్టాల్లో ఉన్నవారిని భరోసా అని నిరూపిస్తుంది. నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటే, పంటకు సరిపడా గిట్టుబాటు ధర ఇస్తే ఏ రైతు ఆత్మహత్య చేసుకొడు.
సాయం చేయండి. సహాయాన్ని అందుకోండి.

ఒక రైతు చనిపోతే దేశం ఒక తరానికి పండించే పంటను కోల్పోయినట్లు గుర్తుంచుకోండి. సాయం చేయాల్సింది కేవలం నాయకులు మాత్రమే కాదు. మన అందరం కూడా , 130 కోట్ల జనాభాలో తల 1 రూపాయి ఇచ్చిన ఎంతో మంది జీవితాలను ఆదుకోవచ్చు . మనిషికి ఒక్క రూపాయి ఇవ్వలేరా చెప్పండి. మీలో ఆత్మాభిమానం, సాయం చేసే గుణం ఉంటే మాతో కలిసి అడుగు వేయండి. పేదరికాన్ని తరిమెద్దాం.

– మెరుగు ప్రవలీక
గొడిషెలపేట, జగిత్యాల జిల్లా
9010811527

## ఉగాది పచ్చడిలో ఔషధ గుణాలు

యాదాద్రి,ఏప్రిల్1 : ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్య పరిరక్షణకు ఉపయుక్తమయ్యే దివ్య ఔషధాలే. ఉగాది అనగానే పచ్చడి గుర్తుకు రావటం అతి సహజం. ఈ పచ్చడిలో ఉండే షడ్రుచులు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. అలాగే ఔషధ గుణాలూ ఉన్నాయి. ఉగాది పచ్చడి సేవనం వల్ల ఆరోగ్యం బాగుంటుందని నమ్మకం. ఉగాది రోజు మనం తినే ఆహారంలో షడ్రుచులు ఉంటాయి. వీటిలో ఏది లేకున్నా ఉగాది పచ్చడి సంపూర్ణం కాదు. ఆరోగ్యం పరిపుష్టం కోసమే ఇలా పెట్టారని పెద్దలు ఏనాడో చెప్పారు. మనశరీరం ఓ పద్దతి ప్రకారం నిర్మితమై ఉంటుంది. అందుకే ఈ రుచులను సమపాళ్లల్లో ఎల్లవేళలా తీసుకోవచ్చు. శరీర అవయవాలు పనిచేయాలంటే దానికి తగ్గట్లుగా అవసరమైన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే పండగల రోజు అయినా వీటిని ఖచ్చింతంగా ఇవ్వాలని పెద్దలు నిర్ణయించి పెట్టారు. ఆరోగ్యానికి హాని కలిగించే సూక్ష్మ క్రిములను సంహారించే శక్తి వేపపూతకి ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఉగాది ఆరోగ్యకరమైన పండగానే చెప్పుకోవాలి. శక్తి పెరుగుతుందని అంటున్నారు. అంటే కష్టం వచ్చినా, సుఖం వచ్చినా సమానంగా స్వీకరించాలనే చక్కటి సూచన చేస్తూ మన పెద్దలు ఈ పచ్చడిని ప్రసాదంగా స్వీకరించే అలవాటును పెట్టారు. అయితే ఉగాది రోజు వీటన్నిటిని మిశ్రనమంగా పచ్చడి చేసుకుని తీసుకోడం ఆచారంగా వస్తోంది. ఉగాది రోజు చేసుకునే వంటకాలు, పచ్చడి వెనక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఉగాది రోజున చేసే ఉగాది పచ్చడిలో అన్నీ ఆరోగ్య లక్షణాలు ఉంటాయి. తీపి, చేదు, వగరు, ఉప్పు, కారం, పులుపుల మేళవింపుతో చేసే ఈ పచ్చడి అందించే రుచుల్లో దాగివున్న ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని వైద్యులు సూత్రీకరిస్తారు. ఈ పచ్చడి కోసం నోరూరని తెలుగువారు ఉండరు. ఆయుర్వేదం ప్రకారం షడ్రుచులు మధుర, ఆమ్ల, లవణ, ఉప్పు, కటు, తిక్త రసాలు. మధుర రసం అంటే తీపి కూడా శరీరానికి అవసరం. ఇది వాతాన్ని తగ్గిస్తుంది, అవయవాలకు శక్తినిస్తుంది. శరీరానికి బలం, వర్ణం ఇస్తుంది. పైత్యం, దప్పికలను తగ్గిస్తుంది. చర్మానికి, కంఠానికి మృదుత్వాన్నిస్తుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వు తద్వారా బరువును పెంచు తుంది. అధిక నిద్రకు దారితీస్తుంది. చర్మ సమస్యలు, క్రిములు పెరుగుతాయి. కఫాన్ని పెంచుతుంది. ఆమ్ల రసం అంటే పులుపు నోటిలో లాలాజలాన్ని పెంచుతుంది. ఆహారానికి రుచిని, శరీర పుష్టిని ఇస్తుంది. వాత, కఫాలను తగ్గిస్తుంది. శరీర బరువును నియంత్రిస్తుంది. మానసికోల్లాసాన్ని ఇస్తుంది. లవణ రసం చాలా తక్కువ ప్రమాణంలో తీసుకోవాలి. కణజాల పనితీరుకు లవణం అవసరం. జ్వరం, వడదెబ్బలు రాకుండా నివారిస్తుంది. వచ్చినప్పుడు లవణరసం ఉన్న పదార్థాలను తీసుకుంటే నీటిశాతం సమతుల్యం అవుతుంది. ఆహారం త్వరగా అరిగేటట్లు చేస్తుంది. విసర్జన సక్రమంగా ఉండేట్లు చేస్తుంది. దీన్ని మోతాదు మించి తీసుకుంటే గుండె, కిడ్నీలకు ప్రమాదం. ఉప్పు కఫాన్ని బయటకు పంపుతుంది. ఎక్కువైతే చర్మం, వెంట్రుకలు, దంతాలకు హాని చేస్తుంది. కారం శరీరంలోని కణాలను ఉద్రేకపరిచి, వేడిని పెంచుతుంది. మంటను పుట్టిస్తుంది. నోటిని పొడిబారేలా చేస్తుంది.

# పంచాంగం ప్రాధాన్యత

"కాల సృజతి భూతాని, కాలస్సంహరతే ప్రజా: కాలము చరాచర సృష్టికి, సృష్టి అంతానికి మూలాధారం. అందుకే కాలాన్ని దైవంగా భావిస్తారు. అలాంటి కాలాన్ని గురించి తెలుసుకు నేందుకు ఉపయోగపడే సాధనమే పంచాంగము. పంచాంగము అనగా పంచంఅంగము. కాలము యొక్క ప్రధాన అంగాలైన, విభాగాలైన తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనే అయిదు అంగముల గురించి తెలుపుతుంది, కనుకనే పంచాంగము అని నమాంకితయైంది.

మనం ప్రస్తుతం వాడుతున్న క్యాలెండర్ తేదీలు, మాసాలు, సంవత్సరాలను సూచిస్తుంది. ఋగ్వేదంలో నక్షత్ర ప్రస్తావన ఉంది. పంచాంగం గ్రహ గణితానికి మూలమైన, సూర్య సిద్ధాంతం 10వ శతాబ్దంకు ముందు పేర్కొన బడింది. విక్రమ శకాన్ని ఉత్తర, పశ్చిమ భారతావనిలో, నేపాల్ లో అనుసరిస్తారు. అలాగే శాలి వాహన శకమును దక్షిణ భారత దేశంలో, మహారాష్ట్ర, గోవా, ప్రాంతాలలో ఆచరిస్తారు. పూర్ణిమతో మొదలయ్యే నెలను పూర్ణిమాంత మాసమని, అమావాస్యతో పూర్తయ్యే మాసాన్ని అమాంత మాసమని అంటారు. మన దేశంలో అధిక ప్రదేశాలలో పూర్ణిమాంత మాసం వాడుకలో ఉంది.

మనం అనుసరిస్తున్న కాలం ఆరు భాగాలుగా విభజితమైంది. సంవత్సరం, ఆయనము, ఋతువు, మాసము, పక్షం, దినం. ఇక వివిధ సంవత్సరాలను పరిశీలిస్తే....(1). చంద్రుని గమనం ఆధారంగా చైత్ర శుక్ల పాడ్యమి మొదలుకొని ఫాల్గుణ కృష్ణ అమావాస్య వరకు గల కాలాన్ని చాంద్రమాన సంవత్సరం అంటారు. (2). సూర్యుడు మేష రాశిలో ప్రవేశించి మీన రాశి వరకు సంచరించే కాల ప్రమాణాన్ని సౌరమాన సంవత్సరం అంటారు. (3). 30 రోజులకు ఒక నెల చొప్పున 360 రోజులతో పన్నెండు మాసాలు కలిగి ఉండేది సావన మాస సంవత్సరం. (4). అశ్విని నుండి రేవతి వరకు కలిగిన, నక్షత్రాల మీదుగా చంద్రుడు సంచారం చేసే కాలాన్ని ఒక నెలగా, ఇలా పన్నెండు నెలలు అంటే 324 రోజులు కలిగిన కాలం నాక్షత్ర మాన సంవత్సరం.(5). గురువు ఒక రాశిలో ప్రవేశించి ఆ రాశిలో ఉండే కాలానుగుణ్యాన్ని బార్హస్పత్యమాన సంవత్సరం అంటారు. ఇక ఆయనాల విషయానికి వస్తే, ప్రతి సంవత్సరం ఉత్తర, దక్షిణాయనాలు రెండు ఉంటాయి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన దినం నుండి కర్కాటకం లో ప్రవేశించే వరకు ఉత్తరాయణం, తిరిగి మకరంలో ప్రవేశించే వరకు దక్షిణాయనం. ప్రతి రెండు మాసాలకు కలిపి ఒక ఋతువు. సంవత్సరానికి ఆరు ఋతువులు. చాంద్ర మానం ప్రకారం శుద్ధ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఒక మాసం. అవి సంవత్సరానికి పన్నెండు ఉంటాయి. మాసానికి శుక్ల, కృష్ణ రెండుపక్షాలు.



దినం అనగా సూర్యోదయం నుండి మొదలై తిరిగి సూర్యోదయంతో ముగిసేది. గ్రహాల పేర్ల ఆధారంగా దినాలకు పేర్ల నిర్ణయాలు జరిగాయి. గణనకు సంబంధించి, అవసరమైన సిద్ధాంత భాగం, ఖగోళ విజ్ఞానం పై ఆధారపడి ఉంటుంది.

ఇదే పంచాంగ గణనకు మూలాధారం. గణనకు సంబంధించిన అంశాలను వివరించేవి సిద్ధాంత గ్రంథాలు. సూర్య: పితామహో వ్యాస: వసిష్టోత్రి పరాశర: కాశ్యపో నారదో గర్గ: మరీచిర్మనురంగిరా: లోమశ: పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగు: శైనకోష్టాదశ హ్యేతే జ్యోతిష శాస్త్ర ప్రవర్తకా: అని మన ప్రాచీన జ్యోతిష సిద్ధాంత కారుల గురించి శ్లోకాధారం. తర్వాతి కాలంలో, భాస్కరాచార్యుడు, వరాహమిహిరుడు, బ్రహ్మ గుప్తుడు, ఆర్యభట్టు తదితర సిద్ధాంత గ్రంథ కర్తలు ఎందరో ఉన్నారు. వరాహ మిహిరుడు తదితరులు పంచాంగ రూపంలో రాయడానికి అవసరమైన, విధానాలను రూపొందించారు. వాటిని తంత్ర గ్రంథాలు అంటారు. గణేశ దైవజ్ఞాది పండితులు కరణ గ్రంథాలను రచించారు. పంచాంగ గణన సులభం చేశారు. ప్రస్తుత కాలంలో, గ్రహలాఘవం, గణకానందం, నర కంఠీరవం, తిథి రత్నావళి, తిథి చంద్రిక తదితరాలు అందుబాటులో ఉన్నాయి.

మానవుడు దైనందిన జీవితంలో ఎన్నో రకాల పనులు చేస్తూ ఉంటాడు. అవి ఎలాంటి ఆటంకాలు లేకుండా, సత్ఫలితాలు పొందడానికి, విజయవంతంగా పూర్తి కావడానికి ఉచిత సమయంలో, ప్రారంభించడం అవసరం. కాల ప్రవాహంలో ఎలాంటి సమయం, సదరు వ్యక్తికి అనుకూల లేదా వ్యతిరేక ఫలితాలను ఇస్తుందో, తెలుసుకోడానికి పంచాంగం ఉప యుక్తమవుతుంది. ప్రధానంగా భారత దేశంలో, ప్రతి శుభ, అశుభ కార్యక్రమానికి పంచాంగం ద్వారా ముహూర్తాన్ని లెక్కించి, దానిని ఆచరించడం అనాదిగా వస్తున్న ఆచరణ. పంచాంగాన్ని విశ్వసించే మానవుడు, జన్మించింది మొదలు మరణించే వరకు, ప్రతి కార్యక్రమంలో పంచాంగాన్ని అనుసరిస్తున్నాడు. ఒకనాడు యజ్ఞ, యాగాది క్రతువులకు, సాంప్రదాయ సత్కర్మలకు ముహూర్తాలు నిర్ణయిం ప బడగా, నేడు బారసాల, కేశఖండనం, వివాహం, నామకరణం,గృహాది నిర్మాణ ప్రారంభాలు, ప్రవేశాలు, వ్రతాలు, పూజలు, ఒక్కటేమిటి అన్నింటికీ, హైందవ జీవన విధానంలో పంచాంగానికి విడదీయలేని, సంబంధం అనుబంధం ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# రాసులను బట్టి నవనాయకుల నిర్ణయం

## ఈ యేడు శుభకృత్ నామ సంవత్సరం

భద్రాద్రి,ఏప్రిల్1 : శుభకృత్ నామ సంవత్సరం శనివారం నాడు వస్తోంది. కాబట్టి రాజు శనిగా పరిగణించాలి. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు.
సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకావం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియ జేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే నవనాయకులు అంటారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది.
చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతాను సార మానాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతులను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది.

# నూకలు తింటాం.. మిమ్ములను గద్దెదించుతాం

**మొదటిపేజీ తరువాయి..**

తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు దేన్నయినా సహిస్తారు తప్ప.. అవమాన్ని సహించే ప్రసక్తి లేదన్నారు. ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు చేసిన వారు కాలగగర్భంలో కలసిపోయారని అన్నారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర రెడ్డితో కలసి మంత్రి మీడియాతో మాట్లాడారు. అడుగడుగునా తెలంగాణ రైతాంగాన్ని, ప్రజలను అవమాన పరుస్తున్న బిజెపి తీరుపై మంత్రి మండిపడ్డారు. నూకలు తినమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారని,... బిడ్డా నూకలు తినమని చెప్తావా. అటుకులో, అన్నమో తిని తెలంగాణ సాధించుకున్నాం. అవసరమైతే నూకలు తింటాం.. మిమ్మల్ని గద్దె దించుతాం. ఇది మా రైతులు చేసి చూపిస్తారు. తెలంగాణ ఏదైనా సహిస్తది కానీ అవమానాన్ని సహించదు. సమైక్య పాలకులు మాట్లాడిన మాదిరిగానే ఇప్పుడు పీయూష్ గోయల్ మాట్లాడుతున్నారు. నాడు సమైక్య పాలకులు అవమానిస్తే.. నేడు పీయూష్ గోయల్ అవమానిస్తున్నారు. సమైక్యవాదులకు చరమగీతం పాడాం.. మీకు కూడా ఆరోజులు దగ్గర్లోనే ఉన్నాయని మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. పార్లమెంట్‌లో మరోసారి తెలంగాణ రైతాంగాన్ని అవమానపరిచేలా గోయల్ మాట్లాడారు. మమ్మల్ని నాలుగు మాటలు అంటే పడుతాం. తెలంగాణ రైతాంగాన్ని, ప్రజల్ని అవమానపరిస్తే సహించేది లేదని సీఎం కేసీఆర్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. గోయల్‌కు అహంకారింపులు, వక్రీకరణలు అలవాటుగా మారాయి. మా మంత్రులు వెళ్లి యాసంగిలో పండే పంట బాయిల్డ్ రైస్ మాత్రమే అని చెప్పినప్పుడు.. మీ ప్రజలకు నూకలు తినడం అలవాటు చేయించండి అని అవమానించారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ధాన్యం కొనమంటే బియ్యం కొంటామని అనడం సరికాదన్నారు. తెలంగాణ యాసంగిలో బియ్యం ఎక్కువగా రావు, బాయిల్డ్ రైస్ మాత్రమే కొనాలన్నారు. తెలంగాణ రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. రైతుబంధు ఇస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి సాగుకు పుష్కలంగా నీరు అందిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ రైతులకు కేసీఆర్ ఎన్నో మంచి పనులు చేస్తున్నాడు. రైతుల ఆత్మహత్యలు తగ్గి, సంతోషంగా ఉన్నారు. పంజాబ్‌తో తెలంగాణకు లింక్ పెట్టడం సరికాదు. మాయమాటలతో రైతుల్ని మభ్య పెడుతున్నారు. రైతుల్ని మేం కాదు.. మీరే మోసం చేస్తున్నారు. పంజాబ్ బియ్యానికి, తెలంగాణ బియ్యానికి తేడా లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ రైతులకు, ప్రజలకు గోయల్ క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దేశానికి అవసరమయ్యే విత్తనాల్లో 60 శాతం తెలంగాణెళి అందిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాయిల్డ్ రైస్ ఇస్తామంటే రా రైస్ మాత్రమే ఇవ్వాలని మెలిక పెట్టడమేంటి? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు అవమానాలను సహించరని తేల్చిచెప్పారు.

పీయూష్ గోయల్ ఒక వ్యాపారిలా మాట్లాడుతున్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కేంద్రం పట్టించుకోవడం లేదు. తోవ చూపించాల్సింది పోయి తొండి మాటలు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధమ్కీ ఇచ్చేది మేం కాదు.. మీరు ఇస్తున్నారని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ దాడులు చేస్తామని ధమ్కీలు ఇస్తున్నారు. మీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వార్త రాస్తే వారికి ధమ్కీలు ఇచ్చి దాడులు చేయిస్తున్నారు. రైతుల పక్షాన నిలబడి గొంతెత్తి ధాన్యం కొనమని అడగడం ధమ్కీ కానే కాదు. ఇది కేవలం డిమాండ్ మాత్రమే. ధమ్కీల సంస్కృతి బీజేపీది అని హరీశ్‌రావు తెలంగాణ వైపు చూస్తుందన్నారు. 300 వైన్ షాపులు దళితులకు కేటాయించాం. నూతన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తీ సుకువచ్చామని మంత్రి పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ టెండర్లలో ఎస్సీల అవకాశం ఇస్తున్నామని, దళితుల సంక్షేమంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఎస్సీ లతో ప్రారంభమైన కల్యాణ లక్ష్మి తర్వత అన్ని వర్గాల వారికి ఇస్తున్నామని తెలిపారు. దళిత



తేల్చిచెప్పారు. డబ్ల్యూటీవో ఒప్పందాలను మార్చగలిగే శక్తి రైతులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మీరే ఆ ఒప్పందాలను మార్చాలని కేంద్రానికి సూచించారు. ఎనిమిదేండ్ల నుంచి మీరే అధికారంలో ఉన్నారు. ఆ ఒప్పందాలను మార్చి రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడాలి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. ఆదాయం రెట్టింపు చేయకుండా, రైతుల పెట్టుబడిని రెట్టింపు చేశారు. ఎరువుల ధరలు రెట్టింపు అయ్యాయి. వ్యవసాయాన్ని లాభదాయకంగా చేస్తామని చెప్పి రైతులను అప్పుల ఊబిల్లోకి దింపారు. రైతులకు బీజేపీ చేసిందేమీ లేదు. అన్యాయం చేశారు. రైతులపై కార్లు ఎక్కించి నడిరోడ్డుపై హత్య చేసిన చరిత్ర బీజేపీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దళిత బంధును రాబోయే రోజుల్లో ఇతర వర్గాలకు విస్తరిస్తామని ఆర్థిక మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులో దళితబంధు పథకం లబ్దిదారులకు మంత్రి యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...దళితబంధు ఓ సామాజిక ఉద్యమమన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.17800 కోట్లు దళితబంధు కోసం కేటాయించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 2 లక్షల మందికి దళిత బంధు అందిస్తామని చెప్పారు. దళిత బంధు పథకం అమలు వేగంగా పూర్తి అవుతుందని, దళిత బంధుతో ఎస్సీల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో దళిత బంధు ప్రాజెక్టులో భాగంగా 100 యూనిట్లను లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళితుల కోసం నేరుగా పది లక్షల రూపాయలు ఇస్తున్నామని తెలిపారు. గతంలో బ్యాంక్ లోన్లు కట్టకుండా దళితులు అప్పులపాలు అయ్యారు. నేడు దేశం మొత్తం బంధు ఒక పథకం కాదు, ఒక ఉద్యమం అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయడంలేదని మండిపడ్డారు. అన్ని వర్గాల శ్రమను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటున్నదని మంత్రి ఘాటుగా విమర్శించారు. ఎన్నికల కోసమే బీజేపీ స్టంట్ చేస్తుందని ఆరోపించారు. తెలంగాణలో పవర్ హాలిడే లేదు. మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో పరిశ్రమలకు పవర్ హాలిడే ఇస్తున్నారని గుర్తు చేశారు. దేశంలోనే తెలంగాణ పవర్ ఫుల్ స్టేట్‌గా మారిందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రంలో కరెంట్ సమస్య లేకుండా చేశాం. కేంద్రం తీరు వల్లనే దేశం మొత్తం కరెంట్ సంక్షోభంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ రేటు పెంచి.. సబ్సిడీ తగ్గించారని మండి పడ్డారు. ఎన్నికలు అయిపోగానే పెట్రోల్ ధరలు పెంచుతున్నారన్నారు. బీజేపీ వాళ్ల మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ అని మంత్రి విమర్శించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7778 మెగా వాట్ల ఉత్పత్తి ఉండేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన మొదటి రోజు నుంచి కష్టపడి ప్రస్తుతం 17305 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకున్నామని చెప్పారు. త్వరలో 4000 మెగా వాట్లతో యాదాద్రి పవర్ ప్లాంట్ అందుబాటు లోకి వస్తుందని ఆయన తెలిపారు. ఆరు నెలల్లో 1600 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అందుబాటులో వస్తుందన్నారు. మార్చి నెలలో 1200 కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్ కొనుగోలు చేశామని అన్నారు. 20 రూపాయలకు ఒక యూనిట్ చొప్పున కొనుగోలు చేసి ప్రజలకు అందిస్తున్నామని వెల్లడించారు. దేశం మొత్తం కరెంట్ కోతల్లో ఉంటే.. తెలంగాణ విద్యుత్ వెలుగుల్లో ఉందన్నారు. దేశంలో విద్యుత్ కోతలకు కేంద్రం వైఖరే కారణమని ఆగ్రహించారు. దేశం అవసరానికి మించి విద్యుత్ అందుబాటులో ఉన్నా.. సరైన పంపిణీ వ్యవస్థ లేక కోతలు విధిస్తున్నారని మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు,

## ఈ ఉగాది, తెలంగాణ యువతకు ఉద్యోగ నామ సంవత్సరం

**మొదటిపేజీ తరువాయి..**

తీపి, చేదు, పులుపు, ఒగరు, కారం, ఉప్పు రుచులు ఉన్నట్టుగానే, జీవితంలోనూ కష్ట నష్టాలు, సుఖ దుఃఖాలు, అనేక కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సిన సందర్భాలు వస్తుంటాయి. అన్ని పరిస్థితుల్లోనూ దేవుడు మీతో ఉండాలని, ప్రజలంతా ధైర్యంగా జీవితంలో ముందడుగు వేయాలని కోరుకుంటున్నాని తెలిపారు. తెలుగు వారంతా ఈ సంవత్సరాన్ని శుభకృత్ నామ సంవత్సరంగా జరుపుకుంటే, తెలంగాణ యువత ఉద్యోగ నామ సంవత్సరంగా చేసుకుంటున్నారని భావిస్తున్నాను. గౌరవ సీఎం కేసీఆర్ గారు 90 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తుండటంతో, యువత ప్రిపరేషన్ లో బిజీగా ఉన్నారు. పరీక్షలకు సిద్దమయ్యే యువత టీ- సాట్ ద్వారా టీవిల్లో, యూ ట్యూబ్ లో ఉచితంగా అందుబాటులో ఉండే ఎగ్జామ్స్ ప్రిపరేషన్ మెటీరియల్ ను ఉపయోగించుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలని ఆడబిడ్డలందరినీ కోరుతున్నాని కవిత అన్నారు.

## ప్రధాని మోడీని హతమారుస్తాం

### ముంబై ఎన్ఐఏ కార్యాలయానికి మెయిల్

### అప్రమత్తం అయిన కేంద్ర హోశాఖ

### దర్యాప్తునకు ఆదేశాలు

**ముంబై,ఏప్రిల్1:** ప్రధాని నరేంద్ర మోడీని చంపేస్తామంటూ ముంబైలోని ఎన్ఐఏ కార్యాలయా నికి బెదిరింపు మెయిల్ వచ్చింది. మోడీ హత్యకు కుట్ర చేసినట్లు ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. ప్రధాని హత్య కోసం 20 మంది స్లీపర్ సెల్స్ ఫిబ్రవరి 28 నుంచి రెడీగా ఉన్నారని.. 20 కేజీల ఆర్డీఎక్స్‌ను కూడా సిద్ధం చేసినట్లు అందులో పేర్కొన్నారు. ప్రధానితో పాటు వేలాది మందిని హతమారుస్తామని, ఇందుకోసం దేశవ్యాప్తంగా 20చోట్ల దాడులకు ప్లాన్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ తన జీవితాన్ని నాశనం చేశాడని మెయిల్ పంపిన వ్యక్తి ఆరోపించాడు. పలు టెర్రరిస్టు ఆర్గనైజేషన్‌లు కుట్రలో పాలుపంచుకుంటున్నట్లు అందులోని వివరాలను బట్టి తెలుస్తోంది. బెదిరింపు మెయిల్‌పై కేంద్ర హోం శాఖ అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. వివరాలను పలు ఏజెన్సీలకు పంపి ఐపీ అడ్రస్‌తో పాటు మెయిల్‌ను ఎవరు పంపారు.. ఎక్కడి నుంచి పంపారు? అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.



దేశంలో అత్యంత విషాద ఘటనను సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తులతో తాను టచ్‌లో ఉన్నానని, దేశవ్యాప్తంగా ఉన్న స్లీపర్ సెల్స్‌ను తాను ఫిబ్రవరి 28న యాక్టివేట్ చేసినట్టు అజ్ఞాత వ్యక్తి తెలిపాడు. ప్రధానమంత్రి మోదీని చంపుతామని బెదిరిస్తూ ఎన్ఐఏకు మెయిల్ రావడం ఇది మొదటిసారి కాదు. 2018లోనూ పుణె పోలీసులకు వచ్చిన ఒక లేఖలో రాజీవ్ గాంధీని హత్య చేసిన తరహాలోనే మోదీని హత్య చేసేందుకు కుట్ర పన్నామనే సమాచారం ఉంది. 1991 మే 21 శ్రీపెరంబుదూరులో శ్రీలంకకు చెందిన ఆత్మహుతి బాంబర్ జరిపిన దాడిలో రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

**మొదటిపేజీ తరువాయి..**

అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం నుంచే వేడిగాలులు వీస్తున్నాయి.

శుక్ర, శనివారాల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా ఎక్కువగా 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఉత్తర తెలంగాణలో సాధారణం కన్నా తక్కువగా, దక్షిణ తెలంగాణలో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. గురువారం రాష్ట్రంలో అత్యధికంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి, ఆదిలాబాద్ జిల్లా చేప్రాలలో 43.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఉపరితల ద్రోణి గురువారం ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా ఇంటీరియర్ తమిళనాడు వరకు సముద్రమట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొన్నది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఎండలు తీవ్రమై గాలిలో తేమ 51 శాతానికి తగ్గిందని వాతావరణ కేంద్రం తెలిపింది. గాలిలో తేమ శాతం తగ్గడంతో పొడిగాలులు వీస్తున్నాయని వివరించింది. ఈ నెలలో ఎండలు అధికంగానే ఉంటాయని, చెడుగొట్టు వానలు అదేస్థాయిలో ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## విశ్వనగరం.. విషనగరంగా మారింది

### ఏడేళ్ల టీఆర్ఎస్ పాలనలో డ్రగ్స్‌కు అడ్డా అయ్యింది

### విద్యార్థులను మత్తుకు బానిసలుగా చేస్తున్నారు

### ధాన్యం కొనాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

### రోగులను ఎలుకలు కొరుకుతుంటే సిగ్గుగా లేదా

### మండిపడ్డ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మదుయాష్కీ

**హైదరాబాద్,ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రం డ్రగ్స్‌కి అడ్డాగా మారిందని, ఏడేళ్ల టీఆర్ఎస్ పాలనలో విశ్వనగరం.. విష నగరంగా మారిందని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ



అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ్మీ తారక రామారావు 50 యెండ్లలో ఏం చేసింది కాంగ్రెస్ అంటున్నావు.. కాంగ్రెస్ ఐటీకి హైదరాబాద్ నీ హబ్ గా చేసిందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా నీ హయంలో డ్రగ్స్ కి క్యాపిటల్ సిటీగా మారిందని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని, తల్లిగా తెలంగాణ ఇచ్చింది సోనియా అని వెల్లడించారు. ఏడేళ్లలో విద్యార్థులను మత్తుకు బానిసగా మార్చేశారని, హైదరాబాద్‌ని విషనగరం చేశారని ఆయన ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెరిగాయి. ఆర్టీసి ఛార్జీలు పెంచారు. ఆసుపత్రుల్లో రోగులను ఎలుకలు కొరుకుతుంటే? సిగ్గు అనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌కి పంటి నొప్పి వస్తే? ఢిల్లీ పోతారు, టెస్టుల కోసం యశోద ఆసుపత్రికి పోతారని, ప్రత్యేక విమానంకి పెట్టిన ఖర్చు ఐసీయూ బాగు చేయొచ్చని ఆయన అన్నారు. ప్రతీ గింజా కొంటా అని చెప్పిన కేసీఆర్.. కల్లబొల్లి మాటలు అపి కల్లాల్లో ఉన్న ధాన్యం కొను.. రైతులను నట్టేట ముంచి రైస్ మిల్లర్ల తో కుమ్మక్కు అయ్యారని ఆయన మండిపడ్డారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. మంత్రులు.. ధాన్యాన్ని పంది కొక్కుల లెక్క బుక్కారని మధు యాష్కీ అన్నారు. నిజామాబాద్‌లో రైస్ మిల్లర్లతో కవిత కుమ్మక్కు అయ్యిందని ఆయన ఆరోపించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ధాన్యం కొనుగోలు పై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు డబ్బులు ఇస్తా అని కోట్లు వసూలు చేసింది కవిత అని, ఆ డబ్బులు ఏమయ్యాయి చెప్పు అని ఆయన ప్రశ్నించారు. యువతను మత్తులో నింపి కాలం వెల్లదీస్తున్నారని, సీపీ, ట్రాఫిక్ చలాన్ల పేరుతో 250 కోట్లు వసూలు చేశారని, పబ్బులు కట్టడి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. సీవీ ఆనంద్ నిజాయితీ గల అధికారి.. ప్రభుత్వం ఒత్తిడికి లొంగకుండా పబ్ ల లో డ్రగ్స్ మాఫియాను కట్టడి చేయాలన్నారు. కేసీఆర్ తెలంగాణను మత్తులో ముంచుతు.. విద్యుత్ ఛార్జీలు పెంచారని, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచారని ఆయన మండిపడ్డారు. నిరుద్యోగులను ప్రభుత్వం నిండా ముంచిందని, డ్రగ్స్ పై కట్టడి చేయండి.. యువతను ఆదుకోండని ఆయన వ్యాఖ్యానించారు. భద్రాచలం రాముడికి కేసీఆర్ టోపీ పెట్టిండు.. భద్రాద్రి రాముడికి పట్టుబట్టలు కోసం కూడా డబ్బులు ఇవ్వడం లేదు కేసీఆర్ అని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్నోడు ఆందోళన కాదు.. పరిష్కారం చూపాలి, కోట్లాడి తెలంగాణ తెచ్చిన అనే కేసీఆర్, వడ్ల కొనుగోలు ఎందుకు చేయించడం లేదని ఆయన అన్నారు.

## ఘరానా దొంగను అరెస్టేసిన పోలీసులు

### భారీగా బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

హైదరాబాద్,ఏప్రిల్ 1: మోస్ట్ వాంటెడ్ ఘరానా దొంగను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 43 ప్రాంతాల్లో చోరీకి పాల్పడినట్టు గుర్తించారు.. అతడే ముచ్చు అంబేద్కర్ అలియాస్ రాజు. అతడి వద్ద నుంచి కోటి 30 లక్షల విలువచేసే 230 తులాల బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి ఆభరణాలు, 18 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

దొంగ గారి తెలివితేటలు చూస్తే మైండ్ బ్లాక్ అవుతుంది.. ఎందుకంటే.. ఈ దొంగకు కల వస్తుందంట.. ఈ రోజు ఏ ఇంట్లో దొంగతనం చేయాలో.. దాని ప్రకారం ఆ రోజు పనికానిచ్చేస్తాడన్నమాట. మరో విషయం ఏంటంటే.. ఈ రోజు దొంగతనం చేయాలా? వద్దా? అనే చిట్టీలను కూడా ఫాలో అవుతాడు రాజు.. రెండు చిట్టీలను వేసి.. అందులో దొంగతనం చేయొచ్చు అనే చిట్టీ వస్తేనే ఆ రోజు దొంగతనం చేస్తాడు. మొత్తంగా పదేళ్ల నుంచి దొంగతనాలు చేస్తూనే ఉన్నాడు.. అప్పటి నుండి దొంగతనం చేసిన బంగారు ఆభరణాలను తన దగ్గరే ఉంచుకుంటున్నాడు.. దీంతో.. ఎక్కడా అనుమానం రాకుండా పోయింది.. ఇప్పటి వరకు అలా రెండు కిలోలకు పైగా బంగారు ఆభరణాలు కూడబెట్టాడు రాజు.. పదేళ్ల నుంచి దొంగతనాలు చేస్తున్నా ఇప్పటి వరకు అరెస్ట్ కాలేదు ఈ ఘరానా కేటుగాడు.

## ఎంజీఎం ఘటనలో సిబ్బంది నిర్లక్ష్యం

### ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

### రోగి శ్రీనివాస్‌ను నిమ్స్‌కు తరలిస్తాం

### మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు

### ఆస్పత్రి నిర్వహణను మెరుగు పరుస్తాం

### ఆస్పత్రిని పరిశీలించి బంధువులను పరామర్శించిన ఎర్రబెల్లి

### సెల్ఫ్ డబ్బా ఆపి చర్యలు తీసుకోండి

### వరంల్ ఎంజిఎం ఘటనపై రేవంత్ ట్వీట్



వరంగల్,ఏప్రిల్1: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్లే రోగిన ఎలుక కొరికిన ఘటన జరిగిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడించారు. రోగి శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి విషమం గా ఉన్నప్పటికీ.. ఐసీయూలో ఎలుకలు కరవడం పూర్తిగా బాధ్యతారాహిత్యమన్నారు. ఆస్పత్రులను మెరుగు చేస్తున్నామని.. ఇలాంటి లోపాలు ఉండటం కూడా సరికాదని మంత్రి తెలిపారు. రోగిని ఎలుకలు కొరికేయడం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నాం. ఇంకా ఎవరిదైనా నిర్లక్ష్యం ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. రోగిని మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించాలని నిర్ణయించామని ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. మంత్రి ఎర్రబెల్లి శుక్రవారం ఉదయం వరంగల్ ఎంజీఎంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎలుకలు కొరికిన పేషెంట్ బంధువులతో మంత్రి మాట్లాడారు. అనంతరం కొత్త సూపరింటెండెంట్‌తో కలిసి ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి రోగులు పడుతున్న ప్రత్యక్షంగా పరిశీలించారు. శానిటేషన్ పనులను స్వయంగా పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎంజీఎం ప్రక్షాళనకు చేపట్టాల్సిన చర్యలపై సమిక్ష చేపట్టారు. రోగిని ఎలుక కొరికిన ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంత్రి ఎర్రబెల్లి పరామర్శించారు. అతడిని నిమ్స్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని మంత్రి చెప్పారు. బాధితుడి కుటుంబ సభ్యులు కూడా నిమ్స్‌కు తరలించేందుకు ఒప్పుకున్నారన్నారు. అతనికి మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై మగ్ర విచారణ చేస్తున్నాం.. ఎంజీఎంలో జరిగిన ఘటన బాధాకరం. విషమంగా ఉన్న పరిస్థితిలోనే రోగి ఎంజీఎంకు వచ్చారు. ఇదిలావుంటే ఃూష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టామని వైద్యవిద్య సంచాలకులు రమేశ్‌రెడ్డి తెలిపారు. ఇటువంటి ఘటనలు జరగడం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారని వెల్లడించారు. ఇంకా ఇలాంటివి



ఎక్కడైనా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రుల్లో పరిశుభ్రత కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దవాఖానలోని ఐసీయూలో ఓ పేషెంట్ను ఎలుకలు కొరికిన నేపథ్యంలో మంత్రి దయాకర్ రావు డీఎంఈ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గోపితో కలిసి హాస్పిటల్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగిన ఐసీయూని, సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగికి మెరుగైన వైద్యం అందించాలని, శుభ్రత విషయంలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. కెసిఆర్ కిట్..ఆస్పత్రుల్లో అన్ని వైద్య సేవలు అంటూ సెల్ఫ్ డబ్బాలుకొట్టుకోవడం మానుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. డబ్బాలు మాని సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సలో వున్న రోగిని ఎలుకలు గాయపరిచిన ఘటన సంచలనం కలిగించింది. ఐసీయూలో భీమారంకు చెందిన రోగి శ్రీనివాస్ కాళ్లు, చేతులను ఎలుకలు కొరికాయి. దీంతో రోగికి తీవ్రంగా రక్తస్రావం జరిగింది. ప్రస్తుతం రోగి శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు సీరియస్ అయ్యారు. తక్షణమే విచారణకు ఆదేశించారు. దీనిపై రేవంత్ కూడా తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రిలో శానిటేషన్ పనులు సరిగా చేయకపోవడం వల్లే ఎలుకలు వస్తున్నాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. దీంతో ఆస్పత్రిలో డ్రైనేజీ, పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. మౌలిక వసతులు మెరుగుపరచకుండా సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వరంగల్ ఎంజిఎం గురించి గొప్పలుచెప్పిన వారు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని అన్నారు. వెంటనే ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు.



జగిత్యాల లోని రవీంద్ర ప్లే స్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కలిగిన వస్త్రధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బీ హరిచరణ్ రావు, బి. శ్రీధర్ రావు, కె.కిషన్, జె. మౌనిక రావు, జె.రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## "ఉగాది పంచాంగ కాలమానిని ఆవిష్కరించిన రాపోలు ఆనంద భాస్కర్"



**జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు, సామాజిక కవి, రచయిత, డాక్టర్ మోహనకృష్ణభార్గవ ప్రచురించిన సత్సాంప్రదాయక "శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది తెలుగు కాలమానిని (కాలెండర్)" మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనందభాస్కర్ హైద్రాబాద్ ఆవిష్కరించారు. రాపోలు ఆనందభాస్కర్ మాట్లాడుతూ, మన తెలుగు సంస్కృతి సాంప్రదయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. భావితరాలకు మన సాంప్రదాయాలను తెలియజేసే ప్రయత్నంలో భాగంగా యువ వేదాధ్యయి మోహనకృష్ణ తెలుగుదనం ఉట్టిపడేలా శాస్త్రీయంగా తిథి, వార నక్షత్రాలు, లగ్న కుండలి, శుభముహూర్తాలు తెలుపుతూ అద్భుతంగా రూపొందించిన ఉగాది తెలుగు కాలమానిని ఆకర్షణీయంగా సామాన్యులకు కూడా సులభంగా అర్థమయే రీతిలో ఉందన్నారు. సమాజంలో సాంస్కృతిక చైతన్యం తీసుకు రావటానికి ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి మోహనకృష్ణ చేస్తున్న కృషిని అభినందించారు, శ్రీ శుభకృత్ నామ సంవత్సరం దేశ ప్రజలందరి జీవితాల్లో శుభం చేకూర్చాలని, శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ మోహనకృష్ణభార్గవ మాట్లాడుతూ కాలగమనంలో కనుమరుగవుతున్న సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు తనవంతు ప్రయత్నంగా గత ఐదు సంవత్సరాలుగా ఉగాది తెలుగు కాలమానిని రూపొందించి, ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్ర భార్గవ, శాయితేజ భార్గవ, ఆంజనేయులు భార్గవ, జగదీశ్ భార్గవ పాల్గొన్నారు.

## దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ బోధన



**కోహెడ ఏప్రిల్ 1 (ప్రజా మంటలు) :** దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూరల్ ఏరియాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5,6,7,8,వ.తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత బోధన చేస్తూ పిల్లలను చైతన్యవంతులుగా తయారు చేస్తున్నారు.దేశ్ పాండే ఫౌండేషన్ వారు కోహెడ మండల కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా స్పోకెన్ ఇంగ్లీష్ బోధన ఉదయం రెండు గంటలు సాయంత్రం రెండు గంటలు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు.ఈ శిక్షణా కార్యక్రమాన్ని కోహెడ ఖమ్మం స్వరూపవేంకటేశం సందర్శించి నిర్వాహకులను అభినందిం చారు.పిల్లలు చక్కగా ఇంగ్లీష్ మాట్లాడడమే కాకుండా వారి డ్రాయింగ్ లో పచ్చదనం పరిశుభ్రతతో పాటుగా కోహెడ గ్రామం నమూనా ఛాయాచిత్రాలు చాలా బాగా డిజైనింగ్ చేశారని ఒక్కొక్క బ్యాచ్ విద్యార్థిని విద్యార్థుల ప్రతిభకు తగిన మార్కులు అందిస్తూ బాక్సులో వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండ జగన్ యాదవ్, రాగటి బాబు, గ్రామస్తులు ఖమ్మం వేంకటేశం, గుగ్గిళ్ల శ్రీనివాస్, హైస్కూలు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి మహమ్మద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ కుమార్, దేశ్ పాండే ఫౌండేషన్ సిద్ధిపేట జిల్లా క్లస్టర్ హెడ్ జి. బానుచందర్, జిల్లా క్లస్టర్ ట్రైనర్ లావణ్య,స్పోకెన్ ఇంగ్లీష్ కోహెడ హైస్కూల్ అధ్యాపకులు కల్యాణి, హేమలత, హైస్కూలు ఉపాధ్యాయులు రేవోజు సదానందం, అశోక్, శ్రీరామ్ సార్, సంపత్, సంజీవ్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మాణిక్యపురంలో ఉగాది బాల కవి సమ్మేళనం



**జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** శ్రీ శుభకృత నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా లింగాల ఘన్‌పూర్ మండలం మాణిక్యపురం ప్రాథమికోన్నత పాఠశాల లో శుక్రవారం నాడు ముందస్తుగా ఉగాది బాల కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. బాల కవి సమ్మేళనం లో భాగంగా కొంతమంది విద్యార్థులు చిట్టి చిట్టి ఉగాది కవితలు గానం చేసి అలరించారు. అలాగే పిల్లలే స్వయంగా షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడి తయారు చేసి తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. పంచాంగ శ్రవణంలో భాగంగా 12 రాశుల యొక్క ఫలాలను కొంతమంది విద్యార్థులు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అన్నింటికీ ఉపాధ్యాయులు నిమ్మ జైపాల్ రెడ్డి నిర్వహణలో బ్రహ్మాండంగా జరిగినందుకు ఎస్.ఎం.సి చైర్ పర్సన్ గంగుల అబ్బులు, వైస్ చైర్ పర్సన్ వట్టిపల్లి, హెచ్ ఎం వెంకటరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాలుగు ఐదో తరగతి పిల్లలు కూడా కవితా గానం చేసి అందరినీ అబ్బుర పరిచారు. విద్యార్థులే భావిభారత పౌరులుగా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ఉపాధ్యాయులు నరసింహారావు కోరారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికి తీసే అవకాశం కూడా ఉంటుందని ఉపాధ్యాయిని జగదీశ్వరి చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, అజయ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సాంస్కృతిక పండుగనా!
# బిజెపి రాజకీయ మీటింగా...?

**హన్మకొండ ఏప్రిల్ 01 (ప్రజా మంటలు):** శుక్ర వారం హన్మకొండలోని అర్%డ% బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఇతర ముఖ్య నాయకులతో కలిసి ప్రెస్ మిట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భం గా ప్రభుత్వ చిప్ విప్ దాస్యం వినయ్ బాస్కర్ మాట్లాడు తూ.....తెలంగాణ రాష్ట్రంలో, వరంగల్ లో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక పెస్టివల్, పేరుకే జాతీయ సాంస్కృతిక కార్యక్రమము, కానీ బిజెపి మీటింగ్ లాగ నిర్వహించారు అన్నారు. ఈ మధ్య జరిగిన సమావేశంలో కొంతమంది గవర్నర్ తమిళసై ని అవమానించారనే, బీజేపీ నేతల ఆరోపణలు అర్ధరహితం. రాష్ట్రంలో మహిళలను గౌరవించే సాంప్రదాయం టీఆర్ఎస్ పార్టీకి ఉంటుంది. ఇక్కడ వరంగల్ లో జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కా నీ ఇక్కడ ఉన్న మంత్రులు మీకు కనిపించలేదా ? సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకరరావు ఇద్దరు మంత్రులు కానీ వీరి పోటోలు మ్మీరు ప్రచురించిన కరపత్రంలో ముద్రించలేదు. మీరు ప్రచురించిన కరపత్రంలో కిషన్ రెడ్డి టూరిజం కేంద్ర మంత్రి కాగా ఆయన టూరిస్టు గా వచ్చారు. కనీసం ఒక్క టూరిస్ట్ ప్రాజెక్టు కుడా తీసుకురాలేదు అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పండించిన వడ్లను కొనుగోలు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి వడ్లు కొంటె నూకలు అవుతాయి, మీరు తినండి అని అన్నారంటే రైతులంటే అతనికి ఎంత చులకనో తెలుస్తుంది. బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొస్తే ఢిల్లీలో రైతులు ఆందోళనలు చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తెస్తే దేశవ్యాప్తంగా రెండురోజులు బంధు కు పిలుపునిస్తే స్వచ్ఛంద బంధు లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. చిల్లర, మల్లారా మాటలు మాట్లాడితే సహించేది లేదని ఈ సందర్భంగా అన్నారు. వరంగల్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,



వర్ధన్నపేట శాసనసభ్యులు ఆర్షురి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రీయ సాంస్కృతిక కార్యక్రమం బిజెపి మీటింగ్ లాగ నిర్వహించారు అని విమర్శించారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్న వారిపోటో లు లేకుండా ముద్రిం చారు. సీఎం కేసీఆర్ రాజకీయాలకు అతీతంగా రాష్టంలో పాలన కొనసాగిస్తున్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు నిర్వహించే పార్టీ టీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అని అన్నారు. ఈ ప్రభుత్వం పేదల కోసం ఉందని, కేంద్రప్రభుత్వం రాష్టానికి ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలి. రైతుల కోసం కోటి ఎకరాల సాగు చేయా లని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారు. ఖాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి. పేదల కోసం సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారు. కేటీ ఆర్ నాయకత్వంలో తెలంగాణ లో పెట్టుబడులు వస్తున్నాయి. అనేక పరిశ్రమల వల్ల అనేక మందికి ఉపాది లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమ్మోచన కమీషన్ చైర్మెన్ నాగుర్ల వేంకటేశ్వర్లు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ ,టిఅర్ఎస్ నాయకులు రాజనాల శ్రీహరి, సుధాకర్ నేత పాల్గొన్నారు.



## జాతి అనైక్యత వల్లే బానిసత్వం

**సంఘటిత సమాజ నిర్మాణమే ఆరెస్సెస్ ధ్యేయం.**
**ఆరెస్సెస్ ప్రాంత కార్యవహ కాచం రమేష్ .జీ**

**జగిత్యాల ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** జాతి అనైక్యత వల్లే మన దేశం వేల సంవత్సరాలు బానిసత్వంలో మగ్గిందని, సంఘటిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆరెస్సెస్ పనిచేస్తుందని ఆరెస్సెస్ తెలంగాణ ప్రాంత కార్యవహ కాచం రమేష్ .జీ అన్నారు. జగిత్యాల నగర ఉగాది ఉత్సవం శుక్రవారం విద్యనగర్ రామాలయం వద్ద నిర్వహిం్గచారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న కాచం రమేష్ జీ మాట్లాడుతూ మన పండగలు,ఉత్సవాలు దేశ ప్రజలకు ఒక లక్ష్యాన్ని, దిశను, దశను నిర్దేశిఒచడానికీ ఉద్దేశించి నిర్ణయించేయన్నారు. విదేశీ పాలన వల్ల మనము పాశ్చత్య నాగరికతకు లోనై ఆశాస్త్రీయమైన విదేశీ పండగలు జరుపు కుంటున్నామన్నారు. జనవరి 1 కి ఎలాంటి ప్రాధాన్యత లేదన్నారు. ప్రకృతిలో జరిగే మార్పుకు అనుగుణంగా ఖచ్చితమైన కాలగణన ప్రకారం ఉగాది మన నూతన సంవత్సరమని వివరించారు. అరెస్సెస్ స్థాపకులు డా.హెడ్గేవార్ ఉగాది రోజున జన్మించా రన్నారు. డాక్టర్ వృత్తిని వదిలిపెట్టి దేశ స్వాతంత్రం కోసం పోరాడారన్నారు.దేశ ప్రజల్లో ఐక్యత లేనంతకాలం స్వాతంత్రం వచ్చినా దాన్ని నిలుకోలేమని ముందుగా ఈ దేశ వాసుల్లో ఐక్యత పెంపొందించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని భావించారన్నారు. మన సంస్కృతి గొప్పతనాన్నీ, మన సనాతన జీవన విధానాన్ని, వివరించాలని భావించి 1925 సం. విజయదశమి రోజున ఆరెస్సెస్ ను ప్రారంభించా రన్నారు.వేలసంవత్సరాలుగా కొనసాగిన మన గొప్ప సంస్కృతి,హైందవ ధర్మ గోప్పతనం తెలుసుకోవడం ద్వార ప్రజల్లో ఐక్యత సాధించి తద్వారా జాతీయ పునర్నిర్మాణం సాధించే దిశగా ఆరెస్సెస్ నిత్యశాఖ ద్వారా కృషి చేస్తుందన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమని, అయితే దురదృష్టవశాత్తు మనం ఆ కుటుంబ వ్యవస్థకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.విదేశీ సంస్కృతి మోజులో పడి మన అమూల్యమైన జీవన విలువలు మర్చిపోవద్దని సూచించారు. అంతకుముందు జగిత్యాల పట్టణం లోని ప్రధాన వీధుల గుండా అరెస్సెస్ గనవేశధారి స్వయం సేవకులు నిర్వహించిన పథసంచలనం పట్టణ వాసులను అలరించింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎల్లా గంగరాజం, ఆరెస్సెస్ జిల్లా సంఘచాలక్ డా. భీమనాతిని శంకర్, నగర్ సంఘచాలక్ జీడిగే పురుషోత్తం, డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడ్లూరి జన్మదిన వేడుకలు



**గొల్లపల్లి ఏప్రిల్ 01 (ప్రజా మంటలు):** ధర్మపురి ముద్దుబిడ్డ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదినం సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలో కేకే కట్ చెసివెడుకలు జరుపుకొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, సర్పంచులు రేవెళ్ల సత్యనారాయణ గౌడ్, చీర్ర గంగాధర్ మరియు సరుసాని తిరుపతి రెడ్డి చేవులమద్ది శ్రీనివాస్ చేవులమద్ది గంగాధర్ తడగొండ విజయ్ గోపన్న శేఖర్ నల్ల విక్రమ్ రెడ్డి నేరెల్ల మహేష్ పాల్గొన్నారు



## రంజని ఆత్మీయ సత్కారం అందుకున్న రాజా నరసింహారావు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏజీ కార్యాలయంలో శుక్రవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా రంజని ఉగాది ప్రత్యేక సంచిక ను ఎంఏబీ ప్రిన్సిపాల్ డైరెక్టర్ మల్లాది ఎస్. సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు రాజా నరసింహారావు కు రంజని మిత్ర ఆత్మీయ సత్కార అవార్డును ప్రధానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ చందా పండిట్, ఉప్పులూరి ఆత్రేయ శర్మ, డాక్టర్ ఆదిరాజు శ్రీనివాస ఫణీంద్ర, నంద్యాల మురళీ కృష్ణ, అమూల్య, స్పందన, అద్దేపల్లి రాధాకృష్ణ, మట్టిగుంట వెంకటరమణ, అధ్యక్షురాలు నందిరాజు పద్మలత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు



**మేడిపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** వేములవాడ ఎమ్మెల్యే డా. రమేష్ బాబు సహకారంతో మేడిపల్లి మండలం గోవిందారం గ్రామంలో డిఎంఎఫ్టీ ద్వారా మంజూరైన 23 లక్షల రూపాయల సిసి రోడ్డులు గోవిందారం ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ ప్రభాకర్ ఆధ్వర్యంలో గోవిందారంలో వీధివీధికి సుమారు 600 మీటర్లు నిర్మించడం జరిగింది. ఈ రోడ్డు ల నిర్మాణంతో చాలా రోజుల తర్వాత మా ఇండ్ల ముందు సిసి రోడ్డు నిర్మాణం జరిగిందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సిసి రోడ్ల నిర్మానికి నిధులు మంజూరి చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మెట్ పల్లి పట్టణంలో బిజెపి నిరసన



**మెట్ పల్లి ఏప్రిల్ 0 1 (ప్రజామంటలు)** మెట్ పల్లి పట్టణ బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కి వినతి పత్రం అందించారు. వ్యవసాయ రంగానికి 24 గంటలు కరెంటు ఉచితంగా ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం తొమ్మిది గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదని ప్రతి సంవత్సరం వేసవిలో డిమాండ్ ఉంటుందని తెలిసి కూడా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం దూరయాదృష్టకరమని ఇందులోపేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నువ్వు .సజ్జ పంటలు పూత పిందె దశలో ఉన్నాయి. కావున రైతులు నష్ట పోకుండా ఉండడానికి నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని వినతిపత్రం అందించారు. బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు బొడ్ల రమేష్ కొమ్ముల రాజ్ పాల్ రెడ్డి . సాంబారి ప్రభాకర్ పూదారి అరుణ .ఇల్లెందుల శ్రీనివాస్. నవీన్. శ్రీరామ్ శివ .నరేష్. నాగేష్ .రంజిత్ .అజయ్. శ్రీకాంత్ .ఆనంద్ .వినయ్. సౌజన్య. లావణ్య. రజిని . తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బిజెపి హుజురాబాద్ పట్టణ దళిత మోర్చా అధ్యక్షుడిగా లంక దాసరి గంగరాజు నియామక పత్రం అందజేసిన బిజెపి పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు. పాల్గొన్న గడ్డం సమ్మయ్య, శాంతి కుమార్, ఇల్లందుల ప్రశాంత్, ఇల్లందుల రఘునాథ్, మొలుగూరి రాజు తదితరులు

## తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలి

**సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రో.సింహాద్రి**



**జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** తెలంగాణ సాధనోద్యమంలో అమరులైన కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదని, తక్షణమే న్యాయం చేయాలని సమాజ్ వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రో.సింహాద్రి అన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ విద్యా యాత్రలో భాగంగా ప్రోపెసర్ టి. వెంకట రాజయ్య ,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.డి.రిజ్వాన్ తో కలిసి ఆయన జనగామ ప్రాంతంలో అమరుల కుటుంబాలను పరామర్శించారు.జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల్లో కొన్ని గ్రామాలు వెళ్లి వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ప్రధానంగా 1200 మంది అమరుల బలిదానాల త్యాగాల ఫలితంగా రాష్ట్రం సిద్ధించిందని అన్నారు.అమరుల కుటుంబాలకు ఇంత వరకు పూర్తిస్థాయిలో ఆశించిన న్యాయం జరగలేదని అన్నారు. గ్రామాలలోని పాఠశాలలో అమరవీరుల పేర్లు నామకరణం చేసి గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అమరుల విగ్రహాలను మండల కేంద్రాల్లో ఎర్పాటు చేయాలని, పాఠ్యపుస్తకాల్లో అమరుల చరిత్రను ముద్రించాలని అన్నారు.తెలంగాణ ఉద్యమ హామీలైన తల్లిదండ్రులకు పెన్షన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కుటుంబాలకు హెల్త్ కార్డు జారీ చేయాలని, అమరుల పిల్లలకు పైస్థాయి వరకు చదువులకు అయ్యే ఖర్చు ప్రభుత్వామే భరించాలని కోరారు.అలాగే భూమి లేని అమరుల కుటుంబాలకు మూడెకురాల భూమి ఇవ్వాలని కోరారు.కొంతమంది అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగం, ఆర్థిక సహాయం ఇంత వరకు అందలేదని అన్నారు.ప్రభుత్వం అమరవీరుల పాలసీ అమలు చేయాలని సింహాద్రి కోరారు.

## ఎస్ఎస్ఎస్ ఎం డిజి స్కూల్ లో ముందస్తు ఉగాది వేడుకలు



**జగిత్యాల ఏప్రిల్ 01(ప్రజా మంటలు) :** ఎస్ ఎస్ ఎస్ ఎం డిజి స్కూల్ లో శుక్రవారం ముందస్తు "ఉగాది" వేడుకలు ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతి సంప్రదాయాల వేషధారణలతో విద్యార్థులు చేసిన ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. తోటి విద్యార్థులు చిన్నారుల నృత్యాలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ హుషారెత్తిం చారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఉపాధ్యాయ బృందం ఏ.రాజేందర్ కె.వేణుగోపాల్ , బాబు, కిషన్, అమీనొద్దీన్ ,మహేష్, గంగేష్ ,నరేష్, ఎన్. ఎస్ చారి ,అనూష ,డి అర్చన ,జి పద్మ, బి. అర్చన, లావణ్య, కే. సునీత, ఏ. సునీత ,విద్యార్థులు పాల్గొన్నారు.












## లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చలివేంద్రం ప్రారంభం

**చిగురుమామిడి ఏప్రిల్ 1(ప్రజ మంటలు) :** మండలంలోని గునుకుల పల్లె గ్రామ పరిధిలోని మెయిన్ రోడ్ చౌరస్తా వద్ద లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తిమ్మాపూర్ సీఐ కాసర్ల శశిధర్ రెడ్డి ఎస్సై దాస సుధాకర్ తో కలిసి ప్రారంభించారు. లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ గాదె రఘునాథ్ రెడ్డి కి చల్లని నీరు ఇచ్చి, నీతిన్ అందరికి అందించారు. విలేకరులతో సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా ఈ రెండు నెలలు వేసవికాలంలో ఏప్రిల్ మే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది, కాబట్టి ప్రతి గ్రామంలో కూడలి వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన రఘునాథ్ రెడ్డి పలువురు అభినందించారు మండలంలో అనేక సేవా కార్యక్రమాలలో లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవలో ముందు ఉండడం పట్ల రఘునాథ్ రెడ్డిని సి ఐ . ఎస్ ఐ ప్రజా ప్రతినిధులు అభినందించారు ఈ కార్యక్రమంలో సింగిల్విండో వైస్ చైర్మన్ కర్రీ వేద మహేందర్ రెడ్డి ఉప సర్పంచ్ కూన పోచయ్య అంద చిన్న స్వామి రెడ్డి సంఘం అధ్యక్షులు కోమ్మెర మహేందర్ రెడ్డి కార్యదర్శి కాంతల శ్రీనివాస్ రెడ్డి కొమర భూపతిరెడ్డి, రాజిరెడ్డి, గునుకుల గణపతి రెడ్డి, కరివేద రాజిరెడ్డి, కాంతాల రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి , రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర ప్రదర్శన



**చిగురుమామిడి ఏప్రిల్ 01 ( ప్రజ మంటలు) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సుందరగిరి నాటక కళా బృందం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం ముందు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి యొక్క జీవిత చరిత్ర ప్రదర్శించారు

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మెడబొయిన తిరుపతి గార్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జంగా శ్రీనివాస్ రెడ్డి,తాళ్ళపల్లి సంపత్ ,తిరుపతి, వంతడుపుల దిలీప్, గందే రమేష్, కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాధారపు సంపత్ ,తాళ్ల పెల్లి రాజయ్య, కక్కేర్ల కృష్ణ స్వామి, అంజయ్య, వెంకట స్వామి, మధుసూదన్, గందె కొమురయ్య, మెడబోయిన , రాజయ్య, రమేష్, కాశివేణి బిక్షపతి, బుర్ర రాజయ్య, పెసరు వెంకటి, గుల్ల కొమరయ్య, అంతడ్పుల వెంకటి, చందవేని పర్శరాములు, పెనుకుల తిరుపతి, కొమురయ్య , బొందయ్య ,చంద్రారెడ్డి , మల్లికార్జున్ రెడ్డి రాములు, రవి, సంపత్ రెడ్డి, రమేష్,రాజకృష్ణ, సంపత్ తదితర కళాకారులు పాల్గొన్నారు

## దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

**ధర్మపురి ఎప్రిల్ 01 ( ప్రజ మంటలు) :** జోగులాంబ గద్వాల జిల్లా లోని కేటి




దొడ్డి మండలం ఇర్కుచెడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం పై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానిక ధర్మపురి డా, బీ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో.. అంబెద్కర్ కు పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి, రాస్తా రోకో చేశారు. భారత రాజ్యాంగం నిర్మాత అయినా బాబాసాహెబ్ అంబెద్కర్ గారి విగ్రహం ధ్వసం చేసిన దండుగులని కఠినంగా శిక్ష వేయాలని దళిత సంఘాలు కోరాయి. స్థానిక ఎంపీపీ చిట్టీ బాబు, అంబెద్కర్ కమిటీ అధ్యక్షులు తరాల్ల కార్తీక్, ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్ నేత, ఉపాధ్యక్షులు ఆవునూరి శ్రీకాంత్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పరాపెల్లి రాజమల్లయ్య పులి చెంద్రయ్య చిలుముల లక్ష్మన్ అనంతుల లక్ష్మన్, అధ్యక్షులు దుర్గం సర్పంచ్ మెదపట్ల దుబ్బాయ జంజీరికని శ్రీనివాస్ మోలుగురి రాజన్న మోలుగురి రమేష్ దాసరి పురుషోత్తం పలిగిరి లచ్చన్న పిప్పల గంగాధర్ కడారి గంగాధర్ కాళ్ళ జగన్ అరవింద్ జిల్లా పెళ్లి రవి సుధాకర్ దేవి అంజలి పులి గంగపోసు శంకర్ శ్యాం రాకేష్ లక్ష్మన్ వెంకటేష్ మరియు ధర్మపురి నియోజకవర్గం దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రగ్బీ క్రీడాకారులను అభినందించిన మంజులరెడ్డి

**హుస్నాబాద్ ఏప్రిల్ 1 (ప్రజా మంటలు) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం రోజున సిద్దిపేట జిల్లా కి చెందిన రగ్బీ క్రీడాకారులు ఇటీవల 4వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ రగ్బీ ఛాంపియన్షిప్ లో సిద్దిపేట జిల్లా జట్టు తరుపున పాల్గొన్నా క్రీడాకారులను అభినందించిన సామాజిక సేవకురాలు,సిద్దిపేట జిల్లా రగ్బీ అధ్యక్షురాలు కర్ణకంటి మంజులరెడ్డి.

సిద్దిపేట లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలకి చెందిన చిలువేరు చందు జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక అయ్యాడు.సిద్దిపేట జిల్లా రగ్బీ అధ్యక్షురాలు మాట్లాడుతూ జాతీయ స్థాయి కి ఎన్నికైన క్రీడాకారున్ని అభినందించి నా వంతుగా క్రీడాకారులకి ఎల్లప్పుడూ సహాయం చేస్తానని, సిద్దిపేట జిల్లా రగ్బీ క్రీడాకారులు జాతీయ స్థాయి లో రాణించి సిద్దిపేట జిల్లా కి మంచి పేరు తీసుకరావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా రగ్బీ కార్యదర్శి శ్రావణపెల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఉద్యోగి పదవి విరమన

**మనకొండూర్ ఏప్రిల్ 01 (ప్రజామంటలు) :** కరీంనగర్ జిల్లా పంచాయతీ కార్యాలయ సభార్డినేటర్ గా విధులు నిర్వహించిన మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన ఏల్పుగొండ లింగయ్య, పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా హాజరైన రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్, మానకొండూర్ శాసనసభ్యుడు డా.రసమయి బాలకిషన్ మరియు కరీంనగర్ సుడా ఛైర్మెన్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ.జి.వి. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ చార్జీల మోత

## పేద మధ్యతరగతి ప్రజలు విలవిల

**జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):** టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జనగామ పట్టణంలోని సబ్ స్టేషన్ వద్ద జనగామ పట్టణ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. దర్నాలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్ పల్లి లింగాజి, జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొన్నే మహేందర్ రెడ్డి, పిఎసిఎస్ వడ్లకొండ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి మాట్లాడుతూ, తాజాగా విద్యుత్ బిల్లుల మోతతో కేసీఆర్ సర్కార్ సామాన్యుడిపై మరో భారం మోపిందని అన్నారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జమాల్ షరీఫ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్ రెడ్డి, కిసాన్ సెల్ జనగామ పట్టణ అధ్యక్షులు మోటే శ్రీనివాస్, జిల్లా నాయకులు బడికె కృష్ణస్వామి, పట్టూరి శ్రీనివాస్, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజిద్, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, ఒబిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కర్రె రాజశేఖర్, ఎం.పి.టి.సి చౌడరం సలేంద్ర శ్రీనివాస్, మరిగడి గ్రామ ఉపసర్పంచ్ కురాకుల నాగరాజు, స్టేషన్ ఘణపూర్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్, ఆకుల లక్ష్మయ్య, బండారు శ్రీనివాస్, వేముల మల్లేశ్, మజీద్ మీర్జ్, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర ఫయాజ్, జనగామ మండల సోషల్ మీడియా కన్వీనర్ యసారపు పరుశురాములు, పొన్నాల యువసేన జనగామ పట్టణ అధ్యక్షు లు కందుల రాజు, కర్రె రాములు, దేవర సత్తయ్య,జాఫర్ మహేశ్వరం శ్రీనివాస్, సౌద మహేష్, కొండ శ్రీనివాస్, చింతకింది నరేష్, పులిగిల్లా శివ, కసాని విజయ్, బెజడి హరీష్, బత్తిని నిఖిల్, సందీప్, ముస్తఫా, పిడుగు సుదర్శన్, కడకంచి కొమురయ్య, కడకంచి రాములు , అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో పోటీ పరీక్షలకు

# ఉచిత శిక్షణ



**హుస్నాబాద్ ఏప్రిల్ 01(ప్రజా మంటలు) :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు వివిధ పోటీ పరీక్షల కోసం తన సొంత నిధులతో ఉచితంగా శిక్షణను అందించనున్నట్లు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్థు చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట జిల్లా లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల, వరంగల్ జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండ లాలతో పాటు మరియు వేలేరు మండలంలోని ఎర్రబెల్లి, కన్నారం గ్రామాలు, కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి, వి.సైదాపూర్ మండలాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రూప్ 2,3,4, తదితర పోటీ పరీక్షలన్నింటికి ఉపయోగపడే విధంగా 3 నెలల పాటు ఫౌండేషన్ శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. గతంలో కూడా శిక్షణ కార్యక్రమం నిర్వహించామని, శిక్షణ రంగంలో విశేష అనుభవం కలిగిన హుస్నాబాద్ ఆర్డీఓ జయచంద్రరెడ్డి పర్యవేక్షణలో స్టడీ సర్కిల్ నిర్వహణలో అనుభవమున్న శ్రీకాంత్ తోడ్పాటు తో ఈ శిక్షణ జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా తన కోరిక మేరకు ముందుకు వచ్చినందుకు ఆర్డీవో కు, స్టడీ సర్కిల్ నిర్వాహకులు శ్రీకాంత్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ లో ఏప్రిల్ 3 నుంచి 7 లోపు దరకాస్తు చేసుకోవాలని తెలియ జేశారు. మొదటి బ్యాచ్ లో ఉండే 200 మంది ని ఎంపిక చేయుటకు ఏప్రిల్ 10 న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఎంపిక అయిన వారికి ఏప్రిల్ 16 నుంచి శిక్షణ తరగతులు హుస్నాబాద్ ఎంపిడిఓ ఆఫీస్ ఆవరణలో ప్రత్యేకంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్ లో ప్రారంభం అవుతాయని తెలిపారు. కావున నియోజకవర్గంలో ని హుస్నాబాద్, అక్కన్న పేట, కోహెడ, వె - సైదా పూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు (రెండు గ్రామాలు) మండల యువతీయువకులు, అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## శుభకృత్‌లో శుభాలే కలగాలి....!

తెలుగు వారి తొలి పండుగ
ఉత్సాహం నింపే ఉగాది వేడుక
వికారి శార్వరి ప్లవ మూడేళ్ళు
మానవాళి మనుగడను

ముప్పు ముంచెత్తగా వచ్చు
శుభకృత్ లో శుభాలే కలగాలని
మానవుల్లో మంచితనం
మదినిండా పెరగాలని....
యుద్ధభయాలు తొలగిపోయి
శాంతి పవనాలు వీయాలనీ...
మామిడాకుల తోరణాలు
మామిడి కాయల వగరు
చింతకాయల పులుపు ,
వేపపూతచేదూ,బెల్లపు తీపీ,

మిరియం కారం ఉప్పు రుచికి తోడై
ఆరు రుచుల మేళవింపుతో
ఉగాది పచ్చడి ఆరగించాలి..!
వసంతాన కోయిల గానాలు
గ్రీష్మం లో వేడితాపాలూ,
వర్షంలో చిరు జల్లులు
శరత్తు లోని వెన్నెల వర్ణనలు,
హేమంతం లో మంచు బిందువులు
శిశిరంలో రాలిన ఆకుల కుప్పలు
సంవత్సర కాలంలో
ప్రకృతి అందించే పుడమి శోభలు

ప్రాణులన్నింటికి పులకరింతలు..
పసందైన వంటకాలు పాయసాలు
పూర్ణం బూరెలు నేతి గారెలు
కుడకల పేరులు గుడిలో పూజలు
సంవత్సర ఫలితాలు
తెలియజేయు పంచాంగ పఠనాలు
వైభవంగా జరిగే
కవి సమ్మేళనాలు
ఊరురా ఉగాది సంబరాలు.
యుగాంతం వరకు జరగాలి..!

– . బి చెరుకు మహేశ్వర శర్మ
రాయికల్ జగిత్యాల



## ఎమ్మెల్సీ రమణను సన్మానించిన తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్

**జగిత్యాల ఏప్రిల్ 01(ప్రజా మంటలు) :** ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎల్ . రమణను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా శాఖ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఉపాధ్యాయ సమస్యలు తీరుతెన్నులు విన్నవించిన వెంటనే, రమణ సచివాలయ విద్యాశాఖ ఉన్నతాధికారులకు, జిల్లా శాఖ ప్రతినిధుల ముందే ఫోన్ చేయడం, సమస్యల పరిష్కారం కొంసం చర్చించడం, సంతొశంగా అనిపించిందన్నారు. వేసవిలో అన్ని పదోన్నతులు ఉంటాయని, 13 జిల్లాలకు సంబంధించినటువంటి స్పౌజ్ బదిలీలు కూడా తప్పక అనుమతిస్తామని, వేసవిలో పదోన్నతుల తర్వాత ఏర్పడిన ఖాళీలలో 317 జిఓ ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు, ప్రమోషన్ ఖాళీలకు బదిలీ అవకాశం కలిగించి, పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ రమణ పేర్కొన్నారు. భాషాపండితుల, పిఈ టీ ల సమస్య తో పాటు తప్పక రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో కంట్రీ బ్యూటరీ పెన్షన్ విధానం రద్దు పరిచి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తారని, అతి త్వరలో దీనిపైన ఒక విధాన ప్రకటన ముఖ్యమంత్రి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తుంగూరి సురేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ గౌడ్. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లే చిన్నయ్య, నాయకులు సమియూద్దిన్, కర్నాకర్,హరీష్,ప్రవీణ్, శేఖర్, నాగభూషణం, శ్రావణ్ కుమార్, బోయ శ్రీనివాస్, నాగేశ్వర్ , రవీందర్,ఫనిభుషన్ లరాం, గుండా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రేణికుంటలో సుపోషణ దినోత్సవం

**తిమ్మాపూర్ ఏప్రిల్1 (ప్రజామంటలు) :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని కొంరయ్య గ్రామములోనీ ఎస్సీ కాలనీకి చెందిన అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు అన్న ప్రసాన మరియు అక్షర అభ్యాస కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, చిన్న పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## గోవిందరంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి



**జగిత్యాల, ఏప్రిల్ 01( ప్రజామంటలు) :** జగిత్యాల జిల్లా గోవిందరం గ్రామములో నిరుపేదలయిన 12 మంది బాధిత కుటుంబాలకు శుక్రవారం గ్రామ సర్పంచి కరండ్ల మధుకర్ సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ మధుకర్ మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ సహకారంతో సిఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా చెక్కులు అందించడం జరిగింది తెలిపారు. 4,24,000/-రూపాయల చెక్కులను12 మంది లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. నల్లపు భుమ్మక్క,తోట కాశమ్మ, ప్యాట సతెమ్మ, బీరుకూరి పరందములు, మల్లమ్మ తనుగుల కిరణ, తనుగుల నర్సింలు, మొరపెల్లి విజయ, యు గంగరాజం, రేపక జలందర్ రేపక లావణ్యలకు అందించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్న రాజు దశరథం వార్డు సభ్యులు మల్యాల భూమి లింగం బిట్టుకు రవి గ్రామ పెద్దలు రాగి గంగాధర్ పోతరాజు సత్తయ్య బందెల మల్లేశం పోతారాజు లక్ష్మణ్, బాండపెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**కథలాపూర్ ఏప్రిల్ 01 (ప్రజామంటలు) :** వేసవికాలం గ్రామంలో రైతులు, పాదచారుల దాహార్తిని తీర్చేవిధంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ మొలిగే లక్ష్మి శ్రీనివాస్ లు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తకళ్ళపెల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. శుక్రవారం తకళ్ళపెల్లి బస్టాండ్ బస్షెల్టర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. సర్పంచ్ మొలిగే లక్ష్మి శ్రీనివాస్ లు మాట్లాడుతూ గ్రామ



## జవహర్ లో ముందస్తుగా ఉగాది వేడుకలు

జగిత్యాల ఏప్రిల్1 (ప్రజామంటలు) : జిల్లా కేంద్రంలోని స్థానిక జవహార్ విద్యా మందిర్ లో శ్రీ శుభకృత్ నామ ఉగాది సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడే విధంగా నూతన వస్త్రాలను ధరించి పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జగన్ మోహన్ రావు గారు మాట్లాడుతూ తెలుగు సంవత్సరం మన జీవితాలలో ఆనందాన్ని నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు శ్రీమతి సంధ్యారాణి, ఉపాధ్యాయ బృందం, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ఎవరులేని అభాగ్యుడుని కష్ట కాలంలో అల్లాడుతున్న గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి కుటుంబానికి, పెదమనుసు చేసుకొని అండగా నిలిచిన శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు 25 కిలోల రైస్ బ్యాగ్ ను అందజేశారు.**

## భూతల్లి ముద్దుబిడ్డ



(కవిత)

ఓనా మట్టి ముద్ద ఎకెక్కి ఏడుస్తావు
ఎందుకు అమ్మ..
పండుటాకులుఎండిపోయి
రాళ్ళుతున్న కాలం..

చిగురుతోడిగిన -పచ్చని ఆకు
అల్లుకొని చల్లనిపందిరి నీడనిస్తున్న
కాలం..
నూతన వ్యవసాయ ప్రారంభ
సమయ కాలం..
ఆస్వాముల ,భూస్వాముల,కాడ పని
కుదిర్చిన మాట కాలం..
యుగాలను దాటుకొని వస్తున్న ఉగాది.
.ఇది గదా..
మామిడి ఆకుల తోరణాలు ఎండకాలం
తిరనాలు..
మట్టిలో పుట్టి మంటలో కాలి నెత్తిన
ఎత్తున బోనమైన..
చ్చడ పటువనైన..
ం చేతిలో కంచమైన.. ధన్యరాసుల కాడ
కుంచమైన..
మంచినీళ్ళ కుండనైన..జాలరుకాడ
గొలెమైన
మీకాళ్ళకు నీళ్ళు ఇచ్చే ముంతనైన..
సారె చిన్నబోయె, కుమ్మరిల్లు గోల్లుమనే,
గుండెలు అవిసిపోయె..
చేనేత దారం పసుపు బంగారం
చూసుకొని..
ఎరుపు సింధూరం పెట్టుకొని..ముంజెతి
మణికట్టు
పై కంకణమై
మీ వెంటె
ఉంటానంటోంది..నా చేతి కంకణం..

ఉగాది పండుగ తెచ్చిన పాశం పేదల
పాలిట శాపం..
గరీభీ బతుకుల్లో తియ్యని
మెతుకుల జాడ దోరకని వేదన కాలం..
పులుపు వగరు తీపి చేదు
జ్ఞాపకాల మనసులో గాయాలు
మిగిల్చిన ..కాలం..
దోసిల్లలో మోదుగు డోప్పలు
పట్టుకొని ఆనందముతో ఆశగా
వొంగితే అంటరాని డోప్పలని
పెంటమిద విసిరితే గాయం నాది..
ఉన్నవాళ్ళు లేనివాళ్ళను
చీకోట్టి చిన్న చూపు చూస్తూంటే
గుండెపగిలి ఏడ్చిన గాయం నాది..
ప్రకృతి నుండి మోదుగు వేరు చేసి
అవమానించిన బాధల గాయం..నాది
పంచభూతాలు చూస్తున్న తూర్పు పడమర
ఉత్తర దక్షిణ నాలుగు దిక్కులు
నాపక్కనే సాక్ష్యం దోరకని సమాజం..
తామర ఆకుల వర్ణం తకదు ఎన్నటికి
తాంగెడు పూవులను
నన్ను సమానంగా చూడని
ఉగాది ఎవరిది చెప్పండి ..
నన్ను పంచముని చేసిందునోరువిప్పండి..
సూర్య చంద్రులారా..

**– కన్నారపు పరుశురాములు**
**జనగామ – 8555929909**









# రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరి పోస్టర్లు ఆవిష్కరణ

**జనగామ ఏప్రిల్ 01 ( ప్రజామంటలు) :** జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి, ఎం.ఎస్.ఎఫ్ అధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏప్రిల్ 9 న ఛలో హైదరాబాద్ లో జరిగే రాజ్యాంగ పరిరక్షణ యుద్ధభేరి సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఎం.ఎస్.ఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఇనుముల నర్సయ్య మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా దళిత రత్న డాక్టర్ రాజమౌళి, డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ భారత దేశ ప్రగతికి పునాది రాజ్యాంగమేనని అన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లనే తెలంగాణ ఏర్పడింది అని మాట్లాడిన కేసీఆర్ రాజ్యాంగాన్ని మార్చాలనడం రాజ్యాంగ ద్రోహమే అవుతుందని అన్నారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చెడంలో పాలకుడిగా కేసీఆర్ వైఫల్యం చెందాడని అన్నారు. ఏప్రిల్ 9 న హైదరాబాద్ లో జరిగే యుద్ధభేరి మహా ప్రదర్శనకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బి.సి నేతలు కవి రచయితలు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వర చారి, నక్క సురేష్, వాసు నాయక్, అంబేద్కర్ సంఘం జితేందర్, ఎం.ఎస్.ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి రామారపు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా నేతలు కన్నారపు పరశురాములు,చుంచు రాజు, గద్దల కిషోర్, జనగామ కో-ఆర్డినేటర్ గువ్వల రవి, (స్టే) ఘనపూర్ కో-ఆర్డినేటర్ సందేన రవీందర్, వి.హెచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నగేష్, మహాజన గళం



రాష్ట్ర కన్వీనర్ సురేష్ మహాజన్, జిల్లా నాయకులు ఇనుముల అనిల్ మాదిగ, మండల నేతలు చాడ ఏలీయా,జనగామ కన్వీనర్ పాలమాకుల శ్రావణ్ కుమార్, నల్ల అంజయ్య, కుమారస్వామి, బాలకృష్ణ, రాజు, జెరిపోతుల మల్లయ్య, గుండె ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికుల చట్టాలను కాపాడుకుందాం

**కరీంనగర్ ఏప్రిల్ 01( ప్రజామంటలు) :** 1996కేంద్ర చట్టం,1979 వలస కార్మికుల చట్టాల రక్షణ కోసం, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ముందుండి పోరాటం చేస్తుందని గంగిపల్లి , చెంజర్ల గ్రామ భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ తెలియ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు నుండే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోర్టు రద్దు చేయాలని, గుండుగుత్తగా ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టడం ఆపాలని, భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న 1996 కేంద్ర చట్టం, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల రక్షణ చట్టం మరియు నిర్మాణాలు వాడే ముడిసరుకుల ధరలు అరికట్టి వాటిపై జీఎస్టీ పన్ను తొలగించాలని ,మేశ్రాం స్కీమ్లో లో భవన నిర్మాణ కార్మికులు అందరిని నమోదు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా దారి మళ్లించిన 1005 కోట్ల రూపాయలు తిరిగి బోర్డు లో జమ చేయాలని, పెండింగ్లో ఉన్న క్లైమ్స్ నిధులు విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ మార్చి 28 29 తేదీల్లో రెండు రోజులు దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయ్యిందని 2కోట్ల మంది భవన నిర్మాణ కార్మికులు సమ్మె చేశారని అన్నారు. చట్టాలున్నా వలస కార్మికులు బానిసలుగా మనుషులుగా చూడలేని పరిస్థితి ఉంది కాబట్టి ఈ రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. ఈ రెండు చట్టాల తో పాటు నాలుగు లేబర్ కోర్టు రద్దు కోసం భవన నిర్మాణ కార్మికులకు ప్రతి నెల 7500 రూపాయలు ఆర్థిక సహకారం ఇవ్వాలని, ముడిసరుకుల ధరలు తగ్గించి జిఎస్టి ఎత్తివేయాలని, భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోయూనియన్ జిల్లా కోశాధికారి వట్టి జగదీష్, గంగి పెల్లి అధ్యక్షులు సదయ్య, చెంజర్ల గ్రామ అధ్యక్షులు పప్పు సత్తయ్య, నాయకులు జక్కుల మల్లేశం,ఆకుల సంపత్,కనకయ్య, మొగిలి, భూమయ్య, అనిల్, రామగిరి సంపత్ పాల్గొన్నారు.

## గాజులపేట ఏక్ మినార్ మజీద్ అభివృద్ధికి 5 లక్షలు



**మెటుపల్లి ఏప్రిల్ 01 (ప్రజామంటలు) :** మజీద్ అభివృద్ధికి 5లక్షలు మంజూరి చేసిన ప్రొసిదింగ్ అందజెసిన ఎమ్మెల్యే కు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎమ్మెల్యే%ం%జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్ లకు మజీద్ లొ ఘనస్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రణవేణి సుజాత సత్యనారాయణ, మునిసిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రావు, కౌన్సిలర్ యమ రాజయ్య, జక్కం బాబు, మైనార్టీ నాయకులు సదర్ షేక్ వాఖిల్. జాకీర్ .నవాబ్. ఎండీ జావిద్ మిర్జా అజాజ్ బేగ్ .అబ్దుల్ సాబీర్ . ఇస్మాయిల్ .ఖదీర్ అలీమ్ .షేక్ నవాబ్. మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సహస్ర కిడ్స్ స్కూల్ లో ఉగాది పండుగ సంబరాలు



**జనగామ ఏప్రిల్ 01(ప్రజామంటలు) :** జనగామ జిల్లా కేంద్రంలో ఉగాది పండుగ సంబరాలు సహస్ర కిడ్స్ పాఠశాలలో పిల్లల ఆటపాటలతో చాలా ఆహ్లాదకర వాతావంణంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సమత, సిబ్బంది సునీత, నిరోషా, తిర్మలతో పాటు పన్నీరు అద్వైత , అనిరూద్, భవిష్య,నిహస్వి, ఆధ్య, సన్విత, రణాధీర్, చిన్నారులు పాల్గొన్నారు.

## ఉన్నపుర చర్చిలో పాస్టర్స్ సమావేశం



**జనగామ ఏప్రిల్ 01 ( ప్రజామంటలు) :** జనగామ జిల్లా కేంద్రంలోని ఉన్నపుర బాప్టిస్ట్ చర్చి లో 15 వ తేదీన జరిగే గుడ్ ఫ్రైడే సందర్భంగా అన్ని మండలాల చర్చి పాస్టర్స్ సమావేశం నిర్వహించారు. 16వ తేదీన ఈస్టర్ కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేయాలని క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధులు రెవ అబ్రహం రాజు (హైద్రాబాద్) రెవ బి. జేమ్స్ (మహబూబాబాద్ )జిల్లా ఫాధర్ అధ్యక్షులు మోసెస్ కుమార్, కార్యదర్శి నర్సింగరావు, స్థానిక సంఘ కాపరి డాక్టర్ ఫిలిప్, సీనియర్ పాస్టర్ నల్ల జాన్, పాదర్ ప్రభాకర్ రెవ సంజీవ్ కుమార్, అన్ని మండల అధ్యక్షులు కార్యదర్శులు,ఉన్నపుర చర్చి కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ వినోద్



**కొడిమ్యాల ఏప్రిల్ 1 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గల బస్టాండ్ ఆవరణలో వేసవికాలంలో ప్రయాణికుల మరియు గ్రామ ప్రజల దాహార్తిని తీర్చుట కొరకు శుక్రవారం చలివేంద్ర ము ను జగిత్యాల అడిషనల్ కలెక్టర్ వినోద్ మరియు డిపిఓ హరికిషన్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కొడిమ్యాల గ్రామపంచాయతీ నీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చలివేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏలేటి మమత- నరసింహారెడ్డి, ఎంపీడీవో పద్మజ, ఎం పీ ఓ గంగాధర్, ఈవో మహేష్, వార్డు సభ్యులు గడ్డం శ్వేత-లక్ష్మారెడ్డి, దుబ్బాక రాధ, ప్రసాద్, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెళ్లి కదేమోనని యువతి ఆత్మహత్య...

మనకొండూర్ ఏప్రిల్ 01 (ప్రజామంటలు) : మనకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన యువతి పెళ్లి కదేమోనని బెంగతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మానకొండూర్ మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొండపల్కల గ్రామానికి చెందిన గట్టు కావేరికి (18) కళ్లెదు గ్రామానికి చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయించారు. అమ్మాయి మేజర్ కానందున మేజర్ వయసు నిండిన తర్వాత పెళ్లి చేస్తామని పెద్దలు నిర్ణయించారు. మూడు రోజుల క్రితం పెళ్లికి నిశ్చయించిన యువకుడు మృతి చెందడంతో అమ్మాయి మనస్తాపానికి గురై జీవితంలో పెళ్లి కదేమోనని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి గట్టు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సిఐ కృష్ణారెడ్డి తెలిపారు.



## సండ్రాళ్ళపల్లి పాఠశాల లో ముందస్తు ఉగాది వేడుకలు

కొడిమ్యాల :ఏప్రిల్ 1( ప్రజా మంటలు) : కొడిమ్యాల మండలంలోని సండ్రాళ్ళ పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆది రెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారుచేసి విద్యార్థులకు, తల్లిదండ్రులకు పంచారు. తీపి , కారం ,పులుపు ,చేదు, ఒగరు, ఉప్పు అనే ఆరు రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి , ఉగాది యొక్క విశిష్టతను విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియడం జరిగింది. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి మాట్లాడుతూ పండుగలలో మొదటి పండుగ ఉగాది పండుగ అని,అలాగే తెలుగు సంవత్సరం ఉగాది పండుగ నుండి ప్రారంభం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు సంస్కృతి సంప్రదాయాలు కాపాడటానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంకాసుల లక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారి మంద లింగవ్వ, ఉపాధ్యాయులు స్వర్ణ, నాయకులు పెంకాసుల మల్లయ్య, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## అమావాస్య అన్నప్రసాద వితరణ

జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):వాసవి కన్యకా పరమేశ్వరి సేవాసమితి,జనగామ ఆధ్వర్యంలో స్థానిక వాస్తు గణపతి దేవాలయం నెహ్రూ పార్క్ వద్ద శుక్రవారం నాడు అమావాస్య సందర్భంగా మహంకాళి వెంకటమ్మ అయోధ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, జనగామ సిఐ బాలాజీ వరప్రసాద్,
బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ ఇలాంటి అన్నప్రసాద వితరణ ఇలాంటి కార్యక్రమం చేపట్టడం పట్ల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సభ్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని కొరారు. ఈ కార్యక్రమంలో లో ఐవిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు బిజ్జల నవీన్ కుమార్ గుప్తా,
వాసవి మాత సేవకులు తడకమళ్ళ నరసింహారావు, రామిణి శివుడు, చెర్వీరాల ఉపేందర్, గట్టు శ్రీనివాస్, తాడూరి సంతోష్,, గొడిశాల శివరామకృష్ణ, మోతే సాయినాథ్, ఎర్రం ప్రసాద్,లగిశెట్టి విజయ్ పాల్గొన్నారు.

## జనగామలో నేడే కవి సమ్మేళనం

జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు): శ్రీ శుభకృత్ నామ ఉగాది సమ్మేళనం ఈనెల 2 వ తేదిన జనగామలో నిర్వహిస్తున్నట్లు జనగామ కవి హృదయ సాహిత్య వేదిక, అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జనగామ గ్రెయిన్ మార్కెట్లోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని అన్నారు. 40వ అలయ వార్షికోత్సవం సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించి కవులను ఘనంగా సత్కారిస్తామని , ఆకుల వేణుగోపాల రావు, జి.కృష్ణ సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తారని, ప్రజలంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెట్లోజు సోమేశ్వరాచారి అ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



***గురువారం గద్వాల్ జిల్లాలోని ఇరుక్కుచెడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చివేసిన దుండగులను శిక్షించాలని, జరిగిన దుశ్చర్యను ఖండిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూత్ కుందారం అధ్యక్షులు పాలమాకుల వేణు మహారాజ్ అధ్వర్యంలో శుక్రవారం జనగామ జిల్లా లింగాలఘనపురం ఎస్.ఐ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాలమకుల నాగరాజు, సహాయ కార్యదర్శి షాధ బాబు, కోశాధికారి పాలమాకుల రమేష్, సాంస్కృతిక కార్యదర్శి షాధ అమర్ నాద్ ,సభ్యులు అంతగాళ్ల అఖిల్ పాల్గొన్నారు.***



## బిజెపి జిల్లా అధికార ప్రతినిధిగా వుగిలే సుధాకర్ పటేల్

కరీంనగర్, ఏప్రిల్ 01( ప్రజామంటలు): భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన వుగిలే సుధాకర్ పటేల్ ను నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణ రెడ్డి నియామక ప్రకటన విడుదల చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన సుధాకర్ పటేల్ కు నియామకపు ఉత్తర్వులు అందించి, జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతర కృషి చేయాలని సూచించారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సుధాకర్ పటేల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బిజెపి జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించి, నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కి, బీజేపీ శ్రేణులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



**జనగామ జిల్లా సామాజిక విద్యావంతుల న్యాయవేదిక జిల్లా అధ్యక్షులుగా తోటకూరి కృష్ణ యాదవ్ ను రాష్ట్ర అధ్యక్షులు యేషబోయిన సాంబయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.**

## ఉచిత కంటి ఆపరేషన్ లు చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



జగిత్యాల ఏప్రిల్ 01(ప్రజా మంటలు) : జగిత్యాల నియోజకవర్గ పరిధిలోనీ 29 మంది నిరుపేదలకు ఆపి రోటరీ క్లబ్ మరియు జగిత్యాల పావని కంటి ఆసుపత్రి అధ్వర్యంలో ఉచితంగా జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ నేత్ర శస్త్ర చికిత్సలు చెసారు. ఈ కార్యక్రమంలో డా.విజయ్,ఆసుపత్రి సిబ్బంది,నాయకులు ఆది రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాయా డెకోలం షాప్ యజమాని రాధా కిషన్, దినేష్ కుమార్, అమిత్ కుమార్ మానవతా దృక్పథంతో మహా అన్నదాన కార్యక్రమం జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ మార్కెట్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## కరెంట్ కోతలు ఎత్తివేయాలని బిజెపి ఆందోళన

**జగిత్యాల ఏప్రిల్ 01(ప్రజా మంటలు) :** బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు...బిజెపి ఆధ్వర్యంలో కరేంటు కోతలు ఎత్తివేయాలని కోరుతూ జగిత్యాల యం.ఆర్.ఓ. కార్యాలయం ముందు నిరసన ధర్నాచేపట్టి యం.ఆర్.ఓ. కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు.. జగిత్యాల మండల బీజేపీ అధ్యక్షులు నలువాల తిరుపతి, పట్టణ అధ్యక్షుడు వీ,రబత్తిని అనిల్, ఆముద రాజు మాట్లాడుతూ, రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని చెప్పి, కనీసం 9 గంటలైనా నిరంతరాయంగా విద్యుత్ అందించకుండా రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని, కోతలు లేని కరెంటును రైతులకు సరఫరా చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. జిల్లా బీజేపీ కోశాధికారి సుంకేట్ దశరథ రెడ్డి., పోటవతిని భరత్. గొస్కుల గంగాధర్ . మెళ్ళ దామోదర్. మెడపట లక్ష్మణ్. పడిగెల సంతోష్.తారల మహేశ్. నరసింహారెడ్డి, భరత్, నక్క జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగవ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**జనగామ ఏప్రిల్ 01 (ప్రజామంటలు):**జనగామ పట్టణంలో కలెక్టర్ కార్యాలయం ముందు మూడో విడత ఇందిరమ్మ ఇండ్లు రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. సిఐటియు జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోట్ల శేఖర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు. బూడిద గోపి, ఎండీ అజారుద్దీన్, జనగామ పట్టణ కమిటి సభ్యులు బాల్నె వెంకట మల్లన్న, మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు కళ్యాణం లింగం, గంగ బోయిన మల్లేష్ రాజ్, దడిగి సందీప్, సంధ్య, శశిరేఖ, తిమోతి, ఎండి గౌసియా, ముసిపట్ల జయ, యాదమ్మ, కళ్లెపు జ్యోతి, కోళ్ల సునంద, ఎండి నాజియా,భాగ్య, ఏనుగుల కమల, బాబురావు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడుగా నెరేళ్ల శ్రవణ్



**మాల్యాల ఏప్రిల్ 01( ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మాల్యాల మండల అధ్యక్షుడుగా మండల కేంద్రానికి చెందిన నెరేళ్ల శ్రవణ్ కుమార్ ను నియమిస్తున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు తెలిపారు.బిజెపి జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు మండల అధ్యక్షుడిగా నియమితులైన నెరేళ్ల శ్రవణ్ కుమార్ కు నియామకపు ఉత్తర్వులు అందించి మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతర కృషి చేయాలని సూచించారు.నెరేళ్ల శ్రవణ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించి, నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పైడిపెల్లి సత్యనారాయణ రావు కి, మండల బీజేపీ శ్రేణులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే నాపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా సమర్థవంతంగా నిర్వర్తించి,పార్టీ శ్రేయస్సు బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రవణ్ తెలిపారు.

## వీరహనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయండి

**కోరుట్ల టౌన్ 01 (ప్రజామంటలు) :** వీరహనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని రామ్ నగర్ 22 వార్డ్ కౌన్సిలర్ మాడవేని నరేష్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా వీరహనుమాన్ యాత్రను నిర్వహించడం జరుగుతుందని, శనివారం నాడు రామ్ నగర్ హనుమాన్ దేవాలయం నుండి ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, రామ్ నగర్ హనుమాన్ దేవాలయం నుంచి వేములవాడ ఫిల్టర్బెడ్ రోడ్, స్టేట్బ్యాంక్ రోడ్, గోవిందగిరినగర్, గాంధీ చౌక్, ముత్యాలవాడ మీదుగా రామ్ నగర్ వరకు సాగుతుందని తెలిపారు.






PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com